మన క్రాంతి
ఇది వాస్తవ పత్రిక...
KR TV




Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati

సంపుటి : 01 సంచిక :82 | గురువారం , 20 ఫిబ్రవరి 2025 | ఎడిటర్ : సందెపల్లి క్రాంతి కుమార్ | పేజీలు : 8 వెల: 3 రూ/-

# ఢిల్లీ ముఖ్యమంత్రిగా రేఖాగుప్తా..!

## నేడే ప్రమాణస్వీకారం..!



2లో

**న్యూ ఢిల్లీ,19 ఫిబ్రవరి ( క్రాంతి న్యూస్ )**ఉత్కంఠకు ఎట్టకేలకు తెరపడింది. ఢిల్లీ ముఖ్యమంత్రిగా రేఖా గుప్తాను ఎమ్మెల్యేలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శాసనసభాపక్షం సమావేశాన్ని పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. సమావేశంలో సీఎల్పీ లీడర్‌గా ఎమ్మెల్యేలు ఎన్నుకున్నారు. ఆమె గురువారం మధ్యాహ్నం 12.35 గంటలకు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ గెలుపొందిన విషయం తెలిసిందే. 70 అసెంబ్లీ స్థానాల్లో 48 చోట్ల బీజేపీ విజయం సాధించింది. ఆమ్ ఆద్మీ పార్టీ కేవలం 22 స్థానాలకే పరిమితమైంది. ఆప్ కన్వీనర్, మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ సైతం ఓడిపోయిన విషయం తెలిసిందే. చాలా సంవత్సరాల తర్వాత ఢిల్లీలో అధికారంలోకి రాగా.. ముఖ్యమంత్రి పదవి కోసం కీలక నేతలు పోటీపడ్డారు. పర్వేష్ వర్మ సైతం ముఖ్యమంత్రి రేసులో నిలిచారు. అలాగే, జితేంద్ర మహాజన్ సైతం ముఖ్యమంత్రి పదవి కోసం పోటీపడ్డారు. ఇక చివరకు సామాజిక సమీకరణలు, ఆర్ఎస్ఎస్‌తో అనుబంధం ఉన్న బినోయ్ సామాజిక వర్గానికి చెందిన రేఖ గుప్తా వైపు అధిష్టానం మొగ్గు చూపినట్లు సమాచారం.

## వందశాతం

# మళ్లీ అధికారంలోకి వస్తాం..

### ▸▸ బీఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశంలో కేసీఆర్ వ్యాఖ్యలు



2లో

**హైదరాబాద్,19 ఫిబ్రవరి( క్రాంతిన్యూస్ ):** తెలంగాణలో మళ్లీ వందశాతం అధికారంలోకి వస్తామని బీఆర్ఎస్ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీ విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం కేసీఆర్ అధ్యక్షతన తెలంగాణ భవన్‌లో జరుగుతున్నది. భేటీలో బీఆర్ఎస్ సిల్వర్ జూబ్లీ వేడుకలపై కార్యక్రమాల నిర్వహణపై, సభ్యత్వ నమోదు, సంస్థాగత కమిటీలు, ప్లీనరి అంశాలపై నేతలతో కేసీఆర్ చర్చించి.. శ్రేణులకు పలు అంశాలపై దిశానిర్దేశం చేస్తున్నారు. ఈ సందర్భంగా పార్టీ ఆవిర్భావం మొదలు ఇప్పటి వరకు సుదీర్ఘ ప్రస్థానాన్ని పార్టీ నేతలకు గుర్తు చేశారు.

## చోరీపై మందలించినందుకు..

# తండ్రిని సజీవ దహనం

## చేసిన 14 ఏళ్ల కొడుకు



న్యూ ఢిల్లీ ,19 ఫిబ్రవరి ( క్రాంతిన్యూస్ ): చౌక్కా జేబులోంచి డబ్బులు దొంగిలించిన కుమారుడ్ని తండ్రి మందలించాడు. దీంతో ఆగ్రహించిన 14 ఏళ్ల బాలుడు తండ్రిపై పెట్రోల్ పోసి నిప్పంటించాడు. ఈ నేపథ్యంలో ఆ వ్యక్తి మంటల్లో కాలి సజీవ దహనమయ్యాడు. బాలుడు ఆ ఇంటి నుంచి పారిపోయాడు. దేశ రాజధాని ఢిల్లీలో ఈ సంఘటన జరిగింది.

2లో

# ఏప్రిల్ 27న బీఆర్ఎస్ బహిరంగ సభ..

## ప్రకటించిన కేసీఆర్



**హైదరాబాద్,19ఫిబ్రవరి(క్రాంతిన్యూస్)** : ఏప్రిల్ 27న భారీ బహిరంగ సభను నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు ప్రకటించారు. తెలంగాణ భవన్‌లో కేసీఆర్ అధ్యక్షతన పార్టీ విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశమైంది. ఈ సందర్భంగా పార్టీ సభ్యత్వ నమోదు, సిల్వర్ జూబ్లీ వేడుకలు, పార్టీ సంస్థాగత ఎన్నికలపై చర్చించారు. పార్టీ సిల్వర్‌జూబ్లీ వేడుకలను ఘనంగా నిర్వహించాలని కేసీఆర్ నిర్ణయించారు.

2లో

## ఒక ఇంట్లో ముగ్గురు మహిళలు అనుమానాస్పదంగా మృతి

2లో



# ప్రతీది గుర్తుపెట్టుకుంటున్నా..

## సిరిసిల్లలో టీ స్టాల్ మూసివేతపై కేటీఆర్ సీరియస్

తన ఫొటో, పేరు పెట్టుకున్నారని సిరిసిల్లలో ఓ టీ స్టాల్ మూసివేయించిన ఘటనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. ప్రతీది గుర్తుపెట్టుకుంటున్నానని.. ఎవర్నీ వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. ఇదే మాట మీద ఉంటానని మీకు మాట ఇస్తున్నానని స్పష్టం చేశారు. ఈ మేరకు టీ షాపు యజమాని బత్తుల శ్రీనివాస్ ఆవేదనతో మాట్లాడుతున్న ఒక వీడియోను షేర్ చేశారు.

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన బత్తుల శ్రీనివాస్ బతుకమ్మ ఘాట్ వద్ద గత నాలుగేళ్లుగా 'కేటీఆర్ టీ స్టాల్' నడిపిస్తున్నాడు. హోటల్ బోర్డుపై కూడా కేటీఆర్ ఫొటో పెట్టుకున్నారు. ఇది గమనించిన సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆ హోటల్‌ను మూసేయించారు. అసలు ఆ టీ స్టాల్‌కు ట్రేడ్ లైసెన్స్ ఉందా? లేకుంటే హోటల్‌ను సీజ్ చేయండి అంటూ మున్సిపల్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.




2లో

## తెలంగాణలో

# 'బుక్' పాలిటిక్స్..

### - పింక్ బుక్ అని చెప్పిన కవిత
### -నేడు ఆరెంజ్ బుక్ తెరపైకి తీసుకొచ్చిన ఈటల



తెలంగాణలో ఓ వైపు ఎండలు మండుతున్నాయి. మరోవైపు పాలిటిక్స్ కూడా అంతే హాట్ హాట్‌గా సాగుతున్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో 'బుక్' పాలిటిక్స్ ట్రెండ్ నడుస్తోంది. ఏపీ మంత్రి నారా లోకేష్ గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తెరమీదకు తీసుకొచ్చి బుక్ పాలిటిక్స్ కల్చర్ ప్రస్తుతం తెలంగాణలోకూ వ్యాపించింది. ఏపీలో వైసీపీ అధికారంలో ఉండగా.. ప్రభుత్వ అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తూ తీసుకునే తప్పుడు నిర్ణయాలను తాము రెడ్ బుక్‌లో రాస్తున్నట్లు లోకేష్ ఓ డైరీ చూపించారు. అందులో చట్టవ్యతిరేక కార్యకలపాలకు పాల్పడే అందరి ఉద్యోగుల పేర్లు నమోదు చేస్తున్నామని.. తాము అధికారంలోకి రాగానే వడ్డీతో సహా తిరిగి చెల్లిస్తామి లోకేష్ హెచ్చరించారు.ప్రస్తుతం తెలంగాణలోనూ బుక్ కల్చర్ మొదలైంది. కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేక వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్, బీజేపీలు తాము అధికారంలోకి రాగానే వడ్డీతో సహా తిరిగి చెల్లిస్తామని హెచ్చరిస్తున్నారు. ఇటీవల మీడియాతో మాట్లాడిన ఎమ్మెల్సీ కవిత.. ప్రభుత్వం చేస్తున్న తప్పులు, సీఎం రేవంత్ రెడ్డి అరాచకాలను 'పింక్ బుక్'లో నోటు చేస్తున్నామన్నారు.

2లో

# నారా లోకేష్ నయా ఆలోచన..

## తిరుమలలో ఆ ఇబ్బందులు తప్పుతాయా?

తిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు నిత్యం వేలాది మంది భక్తులు తరలి వస్తుంటారు. మాసాలతో సంబంధం లేకుండా శ్రీవారి దర్శనానికి అధిక సంఖ్యలో తిరుమల కొండకు వస్తుంటారు. ఇక పర్వదినాలు, బ్రహ్మోత్సవాల వంటి రోజుల్లో ఈ రద్దీ మరింత అధికంగా ఉంటుంది.



2లో


# సీఈసీ, ఈసీల నియామకంపై

## సుప్రీంకోర్టులో పిటిషన్లు..

2లో

## నేటిమాట

"ఎప్పుడూ విజయాన్ని మీ లక్ష్యంగా పెట్టుకోకండి, మీరు చేసే పని నాణ్యంగా చేయడమే మీ లక్ష్యంగా ఉంచుకోండి."



-రతన్ టాటా

## యాదాద్రి భువనగిరిలో

# ఘోర రోడ్డు ప్రమాదం..

## ఇద్దరు మృతి



యాదాద్రి భువనగిరి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. చౌటుప్పల్ మండలం దండు మల్కాపురం వద్ద ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు డివైడర్ ఢీ కొట్టి.. విజయవాడ వైపు వెళ్తున్న కారును ఢీకొట్టింది. కారులో ప్రయాణిస్తున్న ముగ్గురిలో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నది. సాయికుమార్ (33)తో పాటు ఐదునెలల బాలుడు వీర్షాన్ మృతి చెందాడు. ముగ్గురు సభ్యులు హైదరాబాద్ నుంచి సూర్యాపేటకు వెళ్తుండగా.. హైదరాబాద్ వైపు వెళ్తున్న కారులో ఉన్న ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. రెండు కార్లలో మొత్తం ఆరుగు ప్రయాణికులు ఉన్నారు. గాయపడ్డ వారిని చౌటుప్పల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

## హైదరాబాద్‌లో

# 72వ మిస్ వరల్డ్ పోటీలు..!

## తరలిరానున్న వివిధ దేశాల అందాల భామలు..!

ప్రపంచమంతా ఆసక్తిగా ఎదురుచూసే ప్రపంచ అందాల పోటీలకు తెలంగాణ వేదిక కానున్నది. ప్రతిష్టాత్మక మిస్ వరల్డ్ పోటీలను హైదరాబాద్‌లో నిర్వహించాలని నిర్వాహకులు నిర్ణయించారు. 72వ మిస్ వరల్డ్ పోటీలకు తెలంగాణ ఆతిథ్యం ఇవ్వనున్నది. దాదాపు నాలుగు వారాల పాటు జరిగే ఈ పోటీల ప్రారంభ, ముగింపు వేడుకలతో పాటు గ్రాండ్ ఫినాలేను సైతం హైదరాబాద్‌లోనే నిర్వహించనున్నారు. ప్రతిష్టాత్మక మిస్ వరల్డ్ ఫెస్టివల్‌లో 120కిపైగా దేశాలు పాల్గొంటాయి. బ్యూటీ విత్ ఏ పర్పస్ అనే థీమ్‌తో ఈ మిస్ వరల్డ్ పోటీలు నిర్వహించనుండగా.. దేశ విదేశాల ప్రతినిధులకు తెలంగాణ స్వాగతం పలుకబోతున్నది.



2లో

# ఫోన్ ట్యాపింగ్ కేసు..

## మాజీమంత్రి హరీష్ రావుకు బిగ్ రిలీఫ్



2లో

రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో తెలంగాణ హైకోర్టు స్టే విధించింది. ఈ ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ మంత్రి, బీఆర్ఎస్ కీలక నేత హరీష్ రావు, రాధా కిషన్‌రావులకు తెలంగాణ హైకోర్టులో భారీ ఊరట లభించింది. హరీష్ రావు, రాధా కిషన్‌రావులపై.. పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసు దర్యాప్తుపై హైకోర్టు స్టే ఇచ్చింది. తదుపరి విచారణ చేపట్టే వరకు ఈ పిటిషన్‌పై ఎలాంటి చర్యలు చేపట్టవద్దని హైకోర్టు.. పంజాగుట్ట పోలీసులకు ఆదేశాలు జారీ చేసింది.

# వందశాతం మళ్లీ అధికారంలోకి వస్తాం..

## బీఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశంలో కేసీఆర్ వ్యాఖ్యలు

మొదటి పేజీ తరువాయి



హైదరాబాద్,19ఫిబ్రవరి (క్రాంతిన్యూస్): ఉద్యమం, తెలంగాణ అభివృద్ధి కోసం చేసిన కృషిని వివరించారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని.. ప్రజల కోసం పోరాటం చేయాలని శ్రేణులకు కేసీఆర్ పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ మాత్రమే తెలంగాణ కోసం పోరాడగలదని స్పష్టం చేశారు. ప్రజల కష్టాలు బీఆర్ఎస్‌కు మాత్రమే తెలుసునన్నారు. వందశాతం మళ్లీ అధికారంలోకి వస్తామని చెప్పారు. పోరాడి సాధించుకున్న తెలంగాణ కాంగ్రెస్ పాలనలో మళ్లీ వెనక్కి వెళ్లుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పాతికేళ్ల స్ఫూర్తితో మళ్లీ తెలంగాణను నిలబెట్టుకునేందుకు పోరాడాలని పిలుపునిచ్చారు.

# ఏప్రిల్ 27న బీఆర్ఎస్ బహిరంగ సభ..

## ప్రకటించిన కేసీఆర్

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్,19ఫిబ్రవరి(క్రాంతిన్యూస్): ఏడాది పొడవునా ఘనంగా సిల్వర్ జూబ్లీ వేడుకలను నిర్వహించాలని శ్రేణులకు సూచించారు. అలాగే, పార్టీ కమిటీలు వేయాలని నిర్ణయించిన కేసీఆర్.. కమిటీలకు ఇన్‌చార్జ్‌గా హరీశ్‌రావుకు బాధ్యతలు అప్పగించారు. త్వరలోనే మహిళా కమిటీలను ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ఏప్రిల్ పదో తేదీ నుంచి బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమం ఉంటుందని.. ప్రతి జిల్లా కేంద్రంలో పార్టీ సభ్యత్వ నమోదు కొనసాగుతుందన్నారు. అనుబంధ సంఘాల పటిష్టత కోసం సీనియర్ నేతలతో సబ్ కమిటీలు వేయనున్నట్లు తెలిపారు. అదే నెల 10న పార్టీ ప్రతినిధుల సభ ఉంటుందని చెప్పారు.

ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ తెలంగాణ సమాజం సామాజిక చారిత్రక అవసరాల దృష్ట్యా తెలంగాణ చరిత్ర



ప్రసవించిన బిడ్డ బీఆర్ఎస్ అన్నారు. తెలంగాణ రాజకీయ అస్తిత్వ పార్టీగా, తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి తన చారిత్రక బాధ్యతను నిర్వహించిన తెలంగాణ ప్రజల పార్టీ బీఆర్ఎస్ అని తెలిపారు. తెలంగాణ సమాజంలోని అన్ని వర్గాలను చైతన్య పరుస్తూ, తెలంగాణ అస్తిత్వ పటిష్టతకు కృషి చేస్తూ, గతం గాయాల నుంచి కోలుకున్న తెలంగాణను తిరిగి అవే కష్టాల పాలు కాకుండా, గత దోపిడీ వలస వాదుల బారిన పడకుండా, తెలంగాణ ప్రజలకు శాశ్వత విజయం అందించే దిశగా సమస్త పార్టీ శ్రేణులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీని గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి దాకా పటిష్ట నిర్మాణం చేసి అటు పార్టీ విజయాన్ని.. ఇటు తెలంగాణ ప్రజల శాశ్వత విజయం కోసం సమాంతరంగా పని చేయాలని సమావేశంలో పాల్గొన్న నాయకులకు అధినేత దిశానిర్దేశం చేశారు. పార్టీ ఆవిర్భవించి 25వ సంవత్సరంలోకి అడుగిడుతున్న నేపథ్యంలో సిల్వర్ జూబ్లీ వేడుకలను ఏడాది కాలం పాటు నిర్వహించాలని తెలిపారు. విద్యార్థి, మహిళా సహా పార్టీ అనుబంధ విభాగాలను మరింత పటిష్ట పరచాలన్నారు. అందుకోసం సీనియర్ పార్టీ నేతలతో కూడిన సబ్ కమిటీ లను ఏర్పాటు చేసి కార్యాచరణ ప్రారంభించాలన్నారు.

తెలంగాణ అస్థిత్వ పార్టీ బీఆర్ఎస్ అని కేసీఆర్ అన్నారు. గత గాయాల నుంచి కోలుకున్న రాష్ట్రాన్ని మళ్లీ అదే స్థితికి కాంగ్రెస్ నేతలు తీసుకువెళుతున్నారని.. మరోసారి దోపిడీ, వలసవాదుల బారినపడకుండా తెలంగాణను కాపాడాలన్నారు. తెలంగాణ ప్రజలకు శాశ్వత విజయమే బీఆర్ఎస్ లక్ష్యమన్నారు. కాంగ్రెస్ గ్రాఫ్ పడిపోతుందన్న కేసీఆర్.. సీఎంపై ప్రజల్లో ఇంతలా వ్యతిరేకత ఇంత తొందరగా వస్తుందనుకోలేదన్నారు. తెలంగాణలో కచ్చితంగా ఉప ఎన్నికలు వస్తాయని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్పష్టం చేశారు. ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలని శ్రేణులకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర ఆదాయం పడిపోతుందని.. మనం ఏటా ఆదాయం పెంచుకుంటూ వెళ్లామన్నారు. అదే అధికారులు ఉన్నారు కానీ.. ఈ ప్రభుత్వానికి పని చేయించుకోవడం రావడం లేదన్నారు.

# ఢిల్లీ ముఖ్యమంత్రిగా రేఖాగుప్తా..!

## నేడే ప్రమాణస్వీకారం..!

మొదటి పేజీ తరువాయి

డిప్యూటీ సీఎంగా ప్రవేశ్ వర్మ, విజేంద్ర గుప్తాను అసెంబ్లీ స్పీకర్‌గా ఎన్నుకోనున్నట్లు సమాచారం.రేఖాగుప్తా ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో షాలిమార్ బాగ్ అసెంబ్లీ స్థానం గెలుపొందారు. ఆమె గతంలో ఢిల్లీ మేయర్‌గా పోటీ చేశారు. ఢిల్లీ యూనివర్సిటీ ప్రెసిడెంట్‌గా కొనసాగారు. ఢిల్లీ పీతంపురా కౌన్సిలర్.. ఆ తర్వాత మేయర్‌గా పని చేశారు. రేఖాగుప్తా ఎమ్మెల్యేగా ఎన్నికైన తొలిసారే ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించబోతున్నారు. గతంలో ఎమ్మెల్యేగా, ఎంపీగా పని చేసిన అనుభవం లేకపోయినా.. సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్నది. విద్యార్థి నాయకురాలిగా రాజకీయ జీవితాన్ని మొదలుపెట్టి.. సీఎం స్థాయి వరకు ఎదిగారు. విద్యార్థి దశలో ఏబీవీపీలో చురుకుగ్గా వ్యవహరించారు. పితంపుర కౌన్సిలర్‌గా, షాలీమార్ బాగ్-బీ కార్పొరేటర్‌గా పని చేశారు. షాలీమార్ బాగ్ నియోజకవర్గం నుంచి 2015, 2020 ఎన్నికల్లో బీజేపీ నుంచి పోటీ చేసి.. ఆప్‌కు చెందిన బందనాకుమారి చేతిలో పరాజయం పాలయ్యారు. ఈ ఏడాది జరిగిన ఎన్నికల్లో బందనకుమారిని 29వేల ఓట్లకుపైగా తేడా ఓడించి అసెంబ్లీలో అడుగుపెట్టనున్నారు.

రేఖా గుప్తా ప్రస్తుతం ఢిల్లీ బీజేపీ ప్రధాన కార్యదర్శిగా, బీజేపీ మహిళా మోర్చా జాతీయ ఉపాధ్యక్షురాలిగా సేవలందిస్తున్నారు. ఆమె 1974లో హర్యానాలోని జింద్ జిల్లాలోని నంద్‌గఢ్ గ్రామంలో జన్మించారు. ఆమె తండ్రి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉద్యోగి. రేఖ కుటుంబం 1976లో ఢిల్లీకి మకాం మార్చింది. రేఖ ప్రాథమిక విద్య నుంచి ఉన్నత విద్య ఢిల్లీలోనే పూర్తి చేశారు. బాల్యంలోనే రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (%=ూా%) విద్యార్థి విభాగం ఏబీవీపీలో చేరారు. ఢిల్లీ విశ్వవిద్యాలయంలో చదువుతున్న సమయంలో.. ఆమె దౌలత్ రామ్ కళాశాలలో కార్యదర్శి ఎన్నికల్లో గెలుపొందారు. 1995%-%96లో ఆమె ఢిల్లీ విశ్వవిద్యాలయ విద్యార్థి సంఘం ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొందారు. రేఖగుప్తా ఎల్ఎల్‌బీ పూర్తి చేశారు. 2003-04లో ఆమె బీజేపీ యువ మోర్చా ఢిల్లీ యూనిట్‌లో చేరి కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. 2004 నుంచి 2006 వరకు బీజేపీ యువ మోర్చా జాతీయ కార్యదర్శిగా సేవలందించారు. 2007 ఉత్తర పితంపుర కౌన్సిలర్‌గా ఎన్నికయ్యారు. 2009 వరకు డీఎంసీలో మహిళా సంక్షేమం, శిశు అభివృద్ధి కమిటీకి చైర్‌పర్సన్‌గా పని చేశారు. ఇక 2009లో ఢిల్లీ మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శిగా, 2010లో బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యురాలిగా బాధ్యతలు స్వీకరించారు. 2015, 2020 అసెంబ్లీ ఎన్నికల్లో షాలిమార్ బాగ్ స్థానం పోటీ చేసి ఓడిపోయారు.

# నారా లోకేష్ నయా ఆలోచన..

## తిరుమలలో ఆ ఇబ్బందులు తప్పుతాయా?

మొదటి పేజీ తరువాయి

భక్తుల రద్దీకి అనుగుణంగా తిరుమల తిరుపతి దేవస్థానం ఎప్పటికప్పుడు చర్యలు చేపడుతూ ఉంటుంది. భక్తుల రద్దీకి తగినట్లుగా ఏర్పాట్లు చేస్తూ ఉంటుంది. అయితే తిరుమలలో భక్తుల రద్దీ నియంత్రణకు సాంకేతికత సాయం తీసుకోవాలని ఏపీ ప్రభుత్వం భావిస్తోంది. ఏపీ ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ఈ విషయాన్ని వెల్లడించారు. బుధవారం నారా లోకేష్ తిరుపతిలో పర్యటించారు. ఇంటర్నేషనల్ టెంపుల్స్ కన్వెన్షన్ అండ్ ఎక్స్‌పో కార్యక్రమంలో నారా లోకేష్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మాట్లాడిన నారా లోకేష్.. శ్రీవారి దర్శనానికి భక్తులు బారులు తీరకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. తిరుమలలో టికెట్ బుకింగ్, ఆలయ సర్వీసులు మరింత సరళతరం చేస్తామని నారా లోకేష్ వివరించారు. ఆన్‌లైన్ సేవలు ప్రపంచ వ్యాప్తంగా అందుబాటులోకి వచ్చాయన్న నారా లోకేష్.. ఆలయాలలో భక్తుల సౌకర్యాలపై మరింత మెరుగుపరుస్తామన్నారు. అలాగే తిరుమలలో భక్తుల రద్దీ నియంత్రణకు డ్రోన్లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగించే అంశమై చర్యలు తీసుకుంటామని నారా లోకేష్ వివరించారు. తిరుపతి తొక్కిసలాట ఘటన నేపథ్యంలో భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తమను ఆదేశించినట్లు నారా లోకేష్ తెలిపారు.

ధ్వజారోహణంతో కపిలేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

తిరుపతి కపిలతీర్థంలోని కపిలేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం ఉదయం ప్రారంభమయ్యాయి. ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. వేదమంత్రోచ్ఛారణ, శివనామస్మరణ మధ్య ధ్వజారోహణ ఘట్టాన్ని నిర్వహించారు. ధ్వజారోహణంలో భాగంగా మొదట ధ్వజపటం అధిరోహణ, తర్వాత ధ్వజస్తంభానికి అభిషేకం, బలి, నివేదన, దీపారాధన, ఉపచారాలను అర్చకులు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ధ్వజారోహణం నాడు మాత్రమే ధ్వజస్తంభానికి విశేషంగా అభిషేకం చేయటం ఆనవాయితీ. అభిషేకం తర్వాత దీపారాధన.. ఆ తరువాత ఛత్రం, చామరాలు, అద్దం, సూర్యచంద్రులు, విసనకర్ర, ధ్వజంతో ఉపచారాలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా 10 రోజులపాటు ఉదయం, రాత్రి వాహనసేవలు జరగనున్నాయి.

# ఫోన్ ట్యాపింగ్ కేసు..

## మాజీమంత్రి హరీష్ రావుకు బిగ్ రిలీఫ్

మొదటి పేజీ తరువాయి

సిద్దిపేట జిల్లాకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి చక్రధర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గతంలో పలు సెక్షన్ల కింద పంజాగుట్ట పోలీసులు.. హరీష్ రావు, రాధా కిషన్ రావు సహా పలువురిపై కేసు నమోదు చేశారు. ఇందులో భాగంగానే 3 రోజుల క్రితం హరీష్ రావు పీఏను పోలీసులు అరెస్ట్ చేశారు.

అయితే ఈ ఫోన్ ట్యాపింగ్ కేసులో దాఖలు చేసిన ఎఫ్ఐఆర్‌ను క్వాష్ చేయాలని హరీష్ రావు, రాధాకిషన్ రావు తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఇక ఈ కేసులో హరీష్ రావు, రాధాకిషన్ రావులను అరెస్ట్ చేయవద్దని గతంలోనే హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. మరోవైపు.. ఈ కేసులో తెలంగాణ ప్రభుత్వం తరఫున వాదనలు వినిపించడం కోసం సీనియర్ లాయర్ సిద్ధార్థ లూథ్రా వస్తారని పబ్లిక్ ప్రాసిక్యూటర్ తెలిపారు. అయితే ప్రస్తుతం సిద్ధార్థ లూథ్రా మరో కేసులో బిజీగా ఉన్నందున ఈ కేసులో వాదనలు వినిపించేందుకు సమయం కావాలని హైకోర్టును ప్రభుత్వ న్యాయవాది కోరారు. దీంతో తదుపరి విచారణను మార్చి 3వ తేదీకి వాయిదా వేస్తూ తెలంగాణ హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చింది.

సిద్దిపేట జిల్లాకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి చక్రధర్ గౌడ్.. తన ఫోన్‌ను ట్యాపింగ్ చేశారని.. మాజీ మంత్రి హరీష్ రావు, రాధాకిషన్ రావులపై గతేడాది ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిపిన పంజాగుట్ట పోలీసులు.. హరీష్ రావు పీఏ వంశీకృష్ణ సహా ముగ్గురి అరెస్ట్ చేశారు. ఈ ముగ్గురు నిందితులకు ఈనెల 28వ తేదీ వరకు రిమాండ్ విధించారు. తన ఫోన్‌ను ట్యాపింగ్ చేసి బెదిరింపులు, వేధింపులకు గురిచేశారని పిటిషనర్ చక్రధర్ గౌడ్ తెలిపారు. ఒక రైతుకు తెలియకుండా అతని పత్రాలతో హరీష్ రావు పీఏ వంశీకృష్ణ సిమ్‌కార్డు కొనుగోలు చేశారని.. ఆ సిమ్‌ను ఉపయోగించి తనకు బెదిరింపు కాల్స్ చేసి వసూళ్లకు పాల్పడ్డారని చక్రధర్ గౌడ్ ఆరోపించారు. ఇక ఈ కేసులో ఏ-1గా హరీష్ రావు, ఏ-2గా రాధాకిషన్ రావులు ఉన్నారు.

# హైదరాబాద్‌లో 72వ మిస్ వరల్డ్ పోటీలు..!

## తరలిరానున్న వివిధ దేశాల అందాల భామలు..!

మొదటి పేజీ తరువాయి

మే 7 నుంచి ఈ అందాల పోటీలు జరగనున్నాయి. మే 31న గ్రాండ్ ఫినాలే నిర్వహిస్తారు. గతంలో న్యూఢిల్లీ, ముంబయి నగరాల్లో ఈ అందాల పోటీలు జరిగాయి. 71వ ఎడిషన్ ముంబయిలో నిర్వహించిన విషయం తెలిసిందే. ప్రపంచంలోనే అత్యుత్తమ మౌలిక సదుపాయాలున్న హైదరాబాద్ ఇప్పటికే పలు అంతర్జాతీయ వేడుకలకు వేదికైంది. తెలంగాణను పర్యాటకంగా ప్రపంచ పటంలో నిలబెట్టేందుకు ప్రభుత్వాలు ప్రత్యేక ప్రణాళికలు చేపట్టాయి. తెలంగాణ జరూర్ ఆనా నినాదంతో టూరిజం శాఖ దేశ విదేశీ పర్యాటకులను ఇప్పటికే ఆహ్వానిస్తుంది. గొప్ప చేనేత వారసత్వం.. అద్భుతమైన పర్యాటక ప్రదేశాలు.. అరుదైన వంటకాలు.. విభిన్నమైన కళా వారత్వం ఉన్న తెలంగాణలో మిస్ వరల్డ్ పోటీలను స్వాగతిస్తున్నామని.. మిస్ వరల్డ్ లిమిటెడ్ చైర్మన్, సీఈఓ జూలియా మోర్లీ, తెలంగాణ పర్యాటక శాఖ కార్యదర్శి స్మితా సబర్వాల్ ప్రకటించారు.



# సీఈసీ, ఈసీల నియామకంపై

# సుప్రీంకోర్టులో పిటిషన్లు..

## విచారణ వాయిదా వేసిన సర్వోన్నత న్యాయస్థానం..!

మొదటి పేజీ తరువాయి



ప్రధాన ఎన్నికల కమిషనర్ , ఎన్నికల కమిషనర్ల నియామకానికి సంబంధించిన చట్టం చెల్లుబాటును సవాల్ చేస్తూ దాఖలు చేసిన పిటిషన్లపై సుప్రీంకోర్టు విచారణను వాయిదా వేసింది. సీఈసీ, ఈసీల నియామక ప్యానెల్‌లో గతంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సైతం ఉండేవారు. అయితే, కేంద్ర ప్రభుత్వం గతేడాది సీజేఐని తొలగించి.. ఆ స్థానంలో కేంద్ర న్యాయశాఖ మంత్రికి చోటు కల్పిస్తూ.. పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టి.. చట్టాన్ని అమలులోకి తీసుకువచ్చింది. కొత్త చట్టాన్ని సవాల్ చేస్తూ పలువురు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సీఈసీ, ఈసీల నియామకాలకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్లపై ఫిబ్రవరి 19న విచారిస్తామని కోర్టు ప్రకటించింది. పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఎన్‌జీఓ తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్.. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్ కోటీశ్వర్ సింగ్ ధర్మాసనం ఎదుట వాదనలు వినిపించారు.

సీఈసీ, ఈసీల ప్యానెల్ నుంచి సీజేఐని తొలగించి.. ప్రభుత్వ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిందన్నారు. పిటిషన్‌పై అత్యవసరంగా విచారించాల్సిన అవసరం ఉందన్నారు. అయితే, పిటిషనర్ జయ ఠాకూర్ తరఫున హాజరైన న్యాయవాది వరుణ్ ఠాకూర్ మాట్లాడుతూ.. ఇప్పటికే ప్రభుత్వం కొత్త చట్టం మేరకు నియామకాలు చేపడుతుందని తెలిపారు. నియామకాలను సవాల్ చేసినట్లు పేర్కొన్నారు. దిలా ఉండగా.. ప్రభుత్వ ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా జ్ఞానేష్ కుమార్‌ను నియమించిన విషయం తెలిసిందే. ఆయన గతేడాది సహకార మంత్రిత్వ శాఖలో పని చేస్తూ పదవీ విరమణ చేశారు. సీఈసీ రాజీవ్ కుమార్ మంగళవారం పదవీ విరమణ చేయగా.. బుధవారం భారతదేశ 26వ సీఈసీగా జ్ఞానేశ్ కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సీఈసీ నియామకం విషయంలో కేంద్రంపై కాంగ్రెస్ ఆగ్రహం వ్యక్తం చేసింది. చట్టంపై సుప్రీంకోర్టులో సవాల్ చేసిన సమయంలో అర్ధరాత్రి కొత్త సీఈసీని నియమించడంపై మండిపడింది.

# తెలంగాణలో 'బుక్' పాలిటిక్స్..

## ఇప్పుడిదే ట్రెండ్ గురూ..!




మొదటి పేజీ తరువాయి

వచ్చేది తమ ప్రభుత్వమేనని తాము అధికారంలోకి రాగానే.. చట్టవ్యతిరేక కార్యకలపాలకు పాల్పడిన నేతలు, అధికారులకు తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. తాజాగా.. బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ కూడా 'ఆరెంజ్ బుక్' తెరమీదకు తీసుకొచ్చారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా నేడు వరంగల్ జిల్లాలో పర్యచించిన ఎంపీ ఈటల .. అధికారులకు హెచ్చరికలు జారీ చేశారు. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు చట్టప్రకారం నడుచుకోవాలని సూచించారు. బాస్‌ల ఆదేశాలు మేరకు కాకుండా.. చట్టానికి, నిబంధనలకు లోబడి పనిచేయాలని హితవు పలికారు. లేదంటే కఠిన చర్యలు ఎదుర్కొక తప్పదని హెచ్చరించారు. తాము కూడా 'ఆరెంజ్ బుక్' మెయిన్‌టైన్ చేస్తున్నామన్న ఈటల.. ఆ బుక్‌లో అందరి పేర్లు రాసుకుంటున్నామన్నారు. ఎల్లకాలం కాంగ్రెస్ అధికారంలో ఉండదని... సమయం వచ్చినప్పుడు వడ్డీతో సహా తిరిగి చెల్లిస్తామని వార్నింగ్ ఇచ్చారు.

ముఖ్యమంత్రి కార్యాలయం, ముఖ్యమంత్రి బంధువులు, మిత్రులు చెప్పారని చట్టవ్యతిరేక పనులు చేస్తే ఊరుకునేది లేదన్నారు. పిల్లి కళ్లు మూసుకొని పాలు తాగినట్లు భావిస్తే ఉద్యోగులకు తగదన్నారు. టైం వచ్చినప్పుడు లెక్కలతో సహా బయటపెడతామని స్వీట్ వార్నింగ్ ఇచ్చారు. ఇలా తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం బుక్ పాలిటిక్స్ ట్రెండ్ అవుతోంది. బీఆర్ఎస్ పింక్ బుక్ తెరపైకి తీసుకొస్తే.. బీజేపీ ఆరెంజ్ బుక్ ఉందని హెచ్చరిస్తోంది.



# ప్రతీది గుర్తుపెట్టుకుంటున్నా..

## సిరిసిల్లలో టీ స్టాల్ మూసివేతపై కేటీఆర్ సీరియస్

మొదటి పేజీ తరువాయి



కలెక్టర్ హుకుంతో వెంటనే రంగంలోకి దిగిన మున్సిపల్ సిబ్బంది టీ స్టాల్‌ను బలవంతంగా మూసివేయించారు.తన టీ స్టాల్‌ను సీజ్ చేయడంపై బత్తుల శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ట్రేడ్ లైసెన్స్ లేదన్న కారణంతోనే టీ స్టాల్ మూసివేశామని మున్సిపల్ అధికారులు చెబుతున్నారని.. కానీ అసలు కారణం అది కాదని తెలిపాడు. కేటీఆర్ ఫొటో తీసేయాలన్న ఆదేశాలు వినకపోవడంతోనే కలెక్టర్ అలా కక్ష కట్టాడని చెబుతున్నాడు. టీ స్టాల్ పోయినా సరే.. నా అన్న కేటీఆర్ ఫొటో తీయనని స్పష్టం చేయడంతోనే ఇలా హొటల్ సీజ్ చేశారని ఆరోపించాడు. కేటీఆర్ ఫోటో ఉందని హొటల్ మూసేయడం ఏ న్యాయం? ప్రజాస్వామ్యమా, లేక కాంగ్రెస్ తుగ్లక్ పాలనా?" అంటూ స్థానికులు తీవ్రంగా మండిపడుతున్నారు. కేసీఆర్, కేటీఆర్ ఫొటోలను చూసే కాంగ్రెస్ నాయకులు భయపడిపోతున్నారని సెటైర్లు వేస్తున్నారు.

# చత్రపతి శివాజీ జయంతి వేడుకలు

## ఘనంగా నిర్వహించిన మోత్కూరు బిజెపి నాయకులు

మోత్కూర్ 19ఫిబ్రవరి(క్రాంతి న్యూస్):

**హిందూ హృదయ సామ్రాట్**
**ధర్మపరిరక్షణలో వీరవిరాట్**
**17 ఏళ్లకే శత్రువు వెన్నులో వణుకు పుట్టించిన యోధుడు**
**మొఘలులు సైతం వెనుకాడే విధంగా లక్ష సైన్యాన్ని తయారు చేసిన సమర్థుడు**
**27 ఏళ్ళపాటుయుద్ధభూమిలో వెన్నుచూపని శత్రుభయంకరుడు**
**300 కోటలకు అధిపతి**
**3 వేళ్ల ఏళ్లయినా తగ్గదు శివాజీ ఖ్యాతి**
**మేరు నగధీరుడు.. మరాఠయోధుడు**



ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు బిజెపి మోత్కూర్ మండల అధ్యక్షుడు గుదే మధుసూదన్ యాదవ్ అధ్యక్షతన ఈరోజు అనాజిపురం, చౌరస్తాలో శివాజీ చత్రపతి,చిత్రపటానికి పూలమాలవేసి కొబ్బరికాయ కొట్టి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది,ఈ కార్యక్రమంలో బీజేపీ ముఖ్య నాయకులు యాదాద్రి జిల్లా కోశాధికారి గుజ్జ సోమ నరసయ్య, జిల్లా నాయకులు గౌరు శ్రీనివాస్, మున్సిపల్ మాజీ అధ్యక్షులు పోచం సోమయ్య, మండల ప్రధాన కార్యదర్శి గుంటి సతీష్ మాజీ ప్రధాన కార్యదర్శి నార్సింగ్ మహేష్,జిల్లా నాయకులు నల్ల పోగుల వెంకన్న, ఎస్సీ మోర్చా అధ్యక్షులు కొంపెల్లి గణేష్,మచ్చగిరి, గణేష్, మల్లేష్, జీనుకాల దశరథ, సుతారపు వెంకన్న,తదితరులు పాల్గొన్నారు.

# పార్లమెంట్లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ను సవరించాలి

## వామపక్ష విప్లవ పార్టీల ఆధ్వర్యంలో జరిగిన ధర్నా




వరంగల్ ,19 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ):పెట్టుబడిదారీ కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా తయారు చేసిన బడ్జెట్ ను వ్యతిరేకిస్తూ నిరసన కార్యక్రమాలు చేయాలని 10 కమ్యూనిస్టు విప్లవ పార్టీలు ఇచ్చిన పిలుపుమేరకు ఈరోజు వరంగల్ హెడ్ పోస్ట్ ఆఫీస్ సెంటర్లో వివిధ వామపక్ష విప్లవ పార్టీల నాయకులు కార్యకర్తలు మధ్యాహ్నం 12 గంటలకు అరగంట సేపు ధర్నా చేశారు మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ధర్నా అనంతరం జరిగిన కార్యక్రమానికి న్యూ డెమోక్రసీ నాయకులు రాచర్ల బాలరాజు అధ్యక్షత వహించగా సిపిఐ జిల్లా కార్యదర్శి మేకల రవి సిపిఎం జిల్లా నాయకురాలు నలిగంటి రత్నమాల సిపిఐ ఎంఎల్ నీ డెమోక్రసీ న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు గంగుల దయాకర్ సిపిఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి అక్కెనపల్లి యాదగిరి ఎం సి పి ఐ యు నగర కార్యదర్శిసుంచు జగదీశ్వర్ ఎస్ యు సి ఐ నాయకులు,సత్యనారాయణ లు మాట్లాడారు.ఎల్ఐసి 100% ప్రైవేట్ పరం చేయడం ఆపేయాలని ప్రవర్తన సంస్థలను ప్రభుత్వ రంగ సంస్థల ఆస్తులను ప్రైవేటు పరం చేయడం ఆపివేయాలని గ్రామీణ ఉపాధి హామీ పథకం కు 50 శాతం నిధులు పెంచాలని జిడిపిలో విద్య వైద్య రంగాలకు మూడు శాతం నిధులు అదనంగా ఇవ్వాలని ప్రజా పంపిణీ వ్యవస్థకు సబ్సిడీలు పెంచాలని ఎస్సీ ఎస్టీ రంగాలకు మహిళా శిశు సంక్షేమ శాఖలకు అధిక నిధులు కేటాయించాలని, పెట్రోలియం ఉత్పత్తులపై పెంచిన పనులను తగ్గించాలని తెలంగాణ రాష్ట్రానికి నిధులు కేటాయించాలని విభజన సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు .

ఈ కార్యక్రమంలో నాయకులు మహమ్మద్ బషీర్ హమ్మద్ ఆడెపు సదయ్య పనస ప్రసాద్, ఐతం నగేష్ టి భవాని దుర్గయ్య ఇనుముల శ్రీనివాస్ రంజిత్ గన్నారపు రమేష్ గంద్రతి హరిబాబు ప్రశాంత్ మాలి ప్రభాకర్ దేశెట్టి సమ్మయ్య మధు సురేష్ వాణి ఉదయశ్రీ ల తో పాటు ప్రజాసంఘాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# తహసిల్దార్ ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ రాజ్ కుమార్ చే నేరేడు పండ్ల మొక్క నాటించిన వన ప్రేమికుడు నల్లగొండ సమ్మయ్య



చెన్నరావుపేట,19 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ):చత్రపతి శివాజీ జయంతి సందర్భంగా వరంగల్ జిల్లా నెక్కొండ మండలం గుండ్రపల్లి గ్రామంలో ప్రభుత్వ పాఠశాల సమీపంలోని మంచినీటి ట్యాంకి వద్ద నెక్కొండ తహసిల్దార్ ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ వేముల రాజకుమార్ వారిచే గ్రీన్ ఇండియా ఛాలెంజ్ అవార్డు గ్రహీత వన ప్రేమికుడు నల్లగొండ సమ్మయ్య అల్ల నేరేడు పండ్ల మొక్క నాటించడం జరిగింది. ఈ సందర్భంగా తహసిల్దార్ రాజకుమార్ మాట్లాడుతూ మానవాలి పశు పక్షాదులకు చెట్లే మూలాధారం. కాలుష్యం నివారించడానికి పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటి ప్రకృతికి పాటుపడుతున్న సమ్మయ్య ను ఆదర్శంగా తీసుకొని యువకులు మీ ఇంటి వద్ద 1 పండ్ల మొక్కను నాటాలన్నారు. సమ్మయ్య 25 సంవత్సరంల నుండి భవిష్యత్తు తరాలకు ఉపయోగపడే మొక్కలు నాటడం అలవాటు చేసుకొని గుడులు బడులు స్మశాన వాటికలు రచ్చబండలు చెరువు కట్టలు ప్రభుత్వ కార్యాలయాలు మొదలగు ప్రవేశాలలో అధికారులతో అనధికారులతో రాజకీయ నాయకులతో ఇప్పటివరకు 50 వేల పైచిలుకు మొక్కలు నాటడం ముండ్ల కంచె ఏర్పాటు చేసి నీళ్ళు పోసి చెట్లను పెంచడం వృక్షాలు కావడం ఇతను సేవ దేశానికి ఆదర్శనీయమన్నారు. ఇప్పుడు అందుకున్న అవార్డులే కాకుండా ఇంకా మునుముందు అవార్డులు ప్రశంస పత్రాలు అందుకోవాలని మంచి పేరు ప్రతిష్టలు తేవాలని తహసిల్దార్ రాజ్ కుమార్ సమ్మయ్య అభినందించారు. చత్రపతి శివాజీ జయంతి సందర్భంగా ఆ మహనీయునికి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ పల్లకొండ రవి చైన్మెన్ లాక సూరయ్య పాల్గొన్నారు.

# ఎస్ ఎస్ నిఖిలేష్ పెట్రోల్ బంక్ ప్రారంభోత్సవం చేసిన ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్



రామగుండం,19 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ):అంతర్గాం మండలం బ్రాహ్మణపల్లి ఎక్స్ రోడ్ దగ్గర కొత్తగా ఎస్ ఎస్ నిఖిలేష్ పెట్రోల్ బంక్ ను కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి రెబ్బన్ కట్ చేసి ప్రారంభించిన పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రామగుండం నియోజకవర్గ శాసనసభ్యులు రాజ్ ఠాగూర్ అనంతరం ఎస్ఎస్ నిఖిలేష్ పెట్రోల్ బంక్ యజమాన్యానికి మరియు వారి కుటుంబ సభ్యులకు శు భాకాంక్షలు తెలియజేసిన ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్ ఈ కార్యక్రమంలో అంతర్గాం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు రామగుండం కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు

# కాటారం లో అక్రమంగా గుడుంబా విక్రయిస్తున్న మహిళపై కేసు నమోదు

కాటారం,19ఫిబ్రవరి(క్రాంతి న్యూస్): జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్సై అభినవ్ కాటారం వారు తెలిపిన వివరాలు ప్రకారం కాటారం లో ప్రభుత్వ నిషేధిత గుడుంబాను విక్రాయిస్తున్నారనే నమ్మదగిన సమాచారం మేరకు అక్కడ తనిఖీ నిర్వహించగా సిలువెల్లా లక్ష్మి బర్త బుచ్చయ్య అనే మహిళ ఇంటిలో 5 లీటర్ల గుడుంబా దొరికినది ఆమే పై కేసు నమోదు చేశామని తెలిపారు ఈ సందర్భంగా ఎవరైనా ప్రభుత్వ నిషేధిత గుడుంబాను తయారు చేసిన అక్రమంగా విక్రయించిన వారిపై కఠిన చర్యలు తప్పవని కాటారం ఎస్ఐ అభినవ్ తెలిపారు.

# చత్రపతి శివాజి మహారాజ్ జయంతి వేడుకలు



హాసన్ పర్తి,19 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): హసన్ పర్తి నగరంలో భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు మారం తిరుపతి గారి ఆధ్వర్యంలో భారతీయ జనతా పార్టీ నాయకులతో కలిసి చత్రపతి శివాజీ మహారాజ్ గారి చిత్రపటానికి పూలమాలవేసి వారికి నివాళులర్పించడం జరిగింది. కార్యక్రమాన్ని ఉద్దేశించి రైల్వే బోర్డ్ మెంబర్ మేకల హరిశంకర్ గారు మాట్లాడుతూ భారతదేశాన మరాతా సామ్రాజ్యాన్ని నెలకొల్పి మొఘల్ సామ్రాజ్యాన్ని ఎదిరించిన దీరుడు, హిందూ సామ్రాట్ చత్రపతి శివాజీ మహారాజ్ గారు అని అన్నారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ మార్పెల్లి రామచంద్రారెడ్డి గారు, సీనియర్ నాయకులు దాది మధుసూదన్, డివిజన్ ప్రధాన కార్యదర్శి మట్టెడ సుమన్,మాజీ మార్కెట్ డైరెక్టర్ చకిలం రాజేశ్వరరావు, ఎర్రగట్టు దేవస్థానం మాజీ చైర్మన్ పెద్దమ్మ శ్రీనివాస్, ఆర్మీ శ్రీనివాస్, చెన్నూరి రవీందర్,శీలం బిక్షపతి, కందుకూరి శ్రీకాంత్,వేల్పుల మహేందర్, పెద్దమ్మ కుమారస్వామి, మారం రాజేష్, బీజేవైఎం డివిజన్ అధ్యక్షులు కుంబర్కర్ సాయి, రామిశెట్టి అశోక్, చొక్కాం మహేందర్, నంద రవితేజ తదితరులు పాల్గొన్నారు.

# బహుజన చక్రవర్తి చత్రపతి శివాజీ మహారాజ్ ఘనంగా జయంతి



వరంగల్,19ఫిబ్రవరి(క్రాంతిన్యూస్):బహుజన చక్రవర్తి చత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని పురస్కరించుకొని బుధవారం ఆత్మకూరు మాజీ సర్పంచ్ పర్వతరాజు రాజు కాంగ్రెస్ నాయకులు బరుపట్ల కిరీటి,తనుగుల సందీప్,ఉప్పునూతల శ్రీనివాస్,కోమాండ్ల చంద్రారెడ్డి, ముదిరాజ్ కుల సంఘం చైర్మన్ గుండెబోయిన బిక్షపతి చిమ్మని దేవరాజు,కోలా రాంపాల్, వడ్డేపల్లి ప్రసాద్, నాగేల్లి స్వామి, కొమ్ముల ప్రభాకర్, మంద రవి, గొట్టిముక్కుల మల్లారెడ్డి, ఉప్పునూతుల శంకర్, నాగ బండి శివప్రసాద్, పరికి రాల రాజయ్య, ఏరుకొండ రంజిత్ గౌడ్ మొదలగు కాంగ్రెస్ శ్రేణులు బహుజన ఉద్యమకారులు అంబేద్కర్ వాదులు పెరుమాండ్ల శ్రీనివాస్ బొట్ల రాకేష్ మొదలగు వారి ఆధ్వర్యంలో ఆత్మకూరులోని పోచమ్మ సెంటర్లో ని బహుజన చక్రవర్తి చత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహానికి పూలమాలలతో శివాజీ జయంతిని ఘనంగా జరుపుకున్నారు.ఈ కార్యక్రమంలో మహిళలు పెద్దలు పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

# తల్లి బిడ్డల ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పల్వన్ కుమార్.

**ఆరోగ్య కేంద్రానికి వచ్చిన ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలి.**



సిద్ధిపేట ,19 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ):జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.పల్వన్ కుమార్ ఈరోజు జిల్లాలోని పుల్లూరు, నారాయణ రావు పేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆయన ఆకస్మికంగా సందర్శించడం జరిగింది. సందర్శనలో భాగంగా ముందుగా పుల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి, ఉద్యోగుల హాజరు పట్టికను, అనంతరం, ల్యాబ్లో నిర్వహిస్తున్న రక్త పరీక్షల నమూనాలు సేకరించే విధానాన్ని, రికార్డులను, ఫార్మసీ స్టోర్ కు వెళ్లి మందుల నాణ్యతను పరిశీలిస్తున్న అక్రమంలో ఫార్మసిస్ట్ స్టాక్ రిజిస్టర్ ని సరిగా నిర్వహించడం లేదని వ్యాక్సిన్ స్టోర్ లో ఐఎల్ఆర్ లో వివిధ వ్యాక్సిన్ల శీతలిక శీతలీకరణ స్థితిని పరిశీలిస్తున్న క్రమంలో, టెంపరేచర్ చార్ట్ ఉపయోగించడం లేదని, ఈ డి డి లైన్ లిస్ట్ ని అందుబాటులో ఉంచుకోవాలని ఆగ్రహం వ్యక్తం చేశారు, అనంతరం రికార్డులను,ఆయన పరిశీలించారు. అక్కడినుండి నారాయణరావుపేట ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి, లేబర్ రూమ్ ని సందర్శించిన సందర్భంలో, లేబర్ రూమ్ లో ఉండాల్సిన అత్యవసర మందులు, స్టెరిలైజ్డ్ కిట్స్ ను అందుబాటులో లేవని, అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. అనంతరం ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న పేషంట్ల వద్దకు వెళ్లి, వారి యొక్క ఆరోగ్య క్షేమ సమాచారం తెలుసుకొని, తగు సలహాలు సూచనలు ఇవ్వడం జరిగింది, అనంతరం ఈ సందర్శనముద్దేశించి ఆరోగ్య సిబ్బందికి కొన్ని సూచనలు చేశారు, ప్రతి బుధవారం మరియు శనివారం నిర్వహించే వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంలో 100% నూటికి నూరు శాతం (పిల్లలకు, గర్భిణీ స్త్రీలకు)లబ్ధిదారులందరికీ టీకాలు వేయించాలినీ, గర్భిణీ నమోదు మరియు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఈ డి డి అనుసరించి ఆరోగ్య కేంద్రంలో సాధారణ ప్రసవాలును నిర్వహించాలని, ముఖ్యంగా అతి ప్రమాదకరమైన గుర్తించిన గర్భిణి స్త్రీల ప్రసవం కొరకు,102 వాహనం ద్వారా అన్ని రకాల ఆరోగ్య సేవలు అందించే ట్యాగ్ సెంటర్లకు పంపించాలని, ప్రసవం అనంతరం తల్లి బిడ్డల సంక్షేమ చర్యలను చేపట్టాలని, ఆరోగ్య కేంద్రంలో అన్ని రకాల మందుల తోపాటు ఏ ఆర్ వి ఏ ఎస్ వి వ్యాక్సిన్ లను అందుబాటులో ఉంచుకోవాలని, కాలం చెల్లిన మందులపైన ప్రత్యేక శ్రద్ధ వహించాలని, బిన్ కార్డులను ఏర్పాటు చేసుకోవాలని, ఈ సంజీవిని అప్ లో సమాచారాన్ని ఎప్పటికప్పుడు నమోదు చేయాలని, వ్యాక్సిన్ల శీతలి కిరణా స్థితిని (కోల్డ్ చైన్ మెయింటెనెన్స్ ఎప్పటికప్పుడు పరిశీలించుకోవాలని)వి.వి.ఎం. ద్వారా ఎప్పటికప్పుడు,టెంపరేచర్ రిజిస్టర్లో నమోదు చేయాలని, రక్త పరీక్ష నమూనాలను టీ హబుకు సకాలంలో పంపించాలని, వాతావరణ మార్పుల వల్ల ముఖ్యంగా రానున్న ఎండా కాలాన్ని దృష్టిలో పెట్టుకొని, ముందస్తు అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని, ప్రతి మంగళవారము, శుక్రవారం డ్రైడే పాటించాలని ప్రజల్లో కీటక జనిత వ్యాధుల వల్ల వచ్చే ఆరోగ్య సమస్యల పైన అవగాహన కల్పించాలని ఆదేశించారు, సమయపాలన పాటించని వారిపై చర్యలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ ఆనంద్ రావు పి ఓ ఎం హెచ్ ఎం ,వైద్యాధికారులు డాక్టర్ వినోద్ బాబ్జి , డాక్టర్ ఉదయ్ కుమార్, డాక్టర్ బాపురెడ్డి, పాండురంగ చారి హెచ్ ఇ ఆరోగ్య సిబ్బంది ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఏపీలో జీబీఎస్ టెన్షన్..
## మరో మరణం..

ఆంధ్రప్రదేశ్‌లో గులియన్ బారీ సింద్రోమ్ వ్యాధిపై ఆందోళన వ్యక్తమవుతోంది. తాజాగా జీబీఎస్ వ్యాధి కారణంగా ఏపీలో మరో మరణం సంభవించింది. జీబీఎస్‌తో బాధపడుతూ గుంటూరు ఆస్పత్రిలో మరో మహిళ చనిపోయింది. షేక్ గౌహర్ జాన్ అనే మహిళ బుధవారం మృతి చెందారు. జీబీఎస్ లక్షణాలతో ఫిబ్రవరి రెండో తేదీన షేక్ గౌహర్ జాన్ ఆసుపత్రిలో చేరారు. అప్పటి నుంచి చికిత్స పొందుతూ వచ్చిన ఆమె.. బుధవారం మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. మరోవైపు ప్రకాశం జిల్లాకు చెందిన కమలమ్మ అనే మహిళక కూడా జీబీఎస్‌తో బాధపడుతూ ఇటీవల జీజీహెచ్ ఆస్పత్రిలో కన్నుమూసిన సంగతి తెలిసిందే. జీబీఎస్ వ్యాధితో బాధపడుతూ మరికొంతమంది గుంటూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. అటు రాష్ట్రవ్యాప్తంగానూ జీబీఎస్ కేసులు పెరుగుతూ ఉండటంపై ఆందోళన వ్యక్తమవుతోంది.

ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా ఇప్పటి వరకూ 43 జీబీఎస్ కేసులు నమోదైనట్లు ఆరోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్ ఇటీవల తెలిపారు. వీరిలో 17 మంది చికిత్స పొందుతున్నట్లు వెల్లడించారు. జీబీఎస్ వ్యాధి గురించి ఆందోళన వద్దంటున్న ఆరోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్.. బాధితులకు అవసరమైన ఇమ్యూనోగ్లోబిన్ ఇంజెక్షన్లు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. జీబీఎస్ వ్యాధి సోకినా కూడా 85 శాతం చికిత్స అవసరం లేకుండా తగ్గిపోతుందని.. 15 శాతం మందికి మాత్రమే ఇంజెక్షన్లు అవసరం అవుతాయని చెప్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆస్పత్రులకు ఇంజెక్షన్లు సరఫరా చేస్తున్నామని వివరించారు.

మరోవైపు మడమలు, వేళ్లు, మణికట్టు వంటి చోట్ల సూదులతో పొడుస్తున్నట్లు అనిపించడం జీబీఎస్ వ్యాధి లక్షణాలుగా వైద్యులు చెప్తున్నారు. కాళ్ల నొప్పులు, కాళ్లు, చేతుల్లో తిమ్మిర్లు, మంట, నడవలేకపోవడం, మెట్లు ఎక్కలేకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయని హెచ్చరిస్తున్నారు. మాట్లాడడం, నమలడం, మింగడంలో ఇబ్బందిగా ఉంటుందని, ఒక్కోసారి నోరు వంకర పోతుందని చెప్తున్నారు. వ్యాధి తీవ్రమైతే శ్వాస తీసుకోవడంలోనూ ఇబ్బంది వస్తుందని చెప్తున్నారు. ఇలాంటివారికి వెంటిలేటర్‌పై చికిత్స అవసరమవుతుందని వివరిస్తున్నారు. కాచి, వడబోసిన నీళ్లను తాగుతూ.. కూరగాయలు, పండ్లు శుభ్రపరిచిన తర్వాతే భుజించాలని సూచిస్తున్నారు. మాంసం లాంటి పదార్థాల్ని బాగా ఉడికించాలని.. పచ్చి గుడ్లు తినకూడదని చెప్తున్నారు.





## చంద్రబాబు దృష్టిని
# ఆకర్షించిన యువకుడు..
### త్వరలోనే కలుస్తానన్న సీఎం..



చక్కని సాఫ్ట్‌వేర్ జాబ్.. భారీగా జీతం.. వారానికి ఐదు రోజుల పని, రెండు రోజులు రిలాక్స్.. ఇలాంటి సౌకర్యాలు ఉన్నవారు ఎవరైనా ఉద్యోగం వదిలేస్తారా.. అది కూడా రైతుల కోసం.. కానీ ఆ యువకుడు ఇవేవీ వద్దనుకున్నాడు, రైతులకు సాయం చేయడమే ముఖ్యమనుకున్నాడు.. అందుకే ఇప్పుడు ముఖ్యమంత్రి దృష్టిలో పడ్డాడు. బొర్రా శ్రీనివాస్ రావు.. బీహెచ్ఈఎల్‌లో లక్షణమైన ఉద్యోగం, భారీగా జీతం, స్థిరమైన కెరీర్.. కానీ ఇవేవీ అతనికి నచ్చలేదు. రైతులకు ఉపయోగపడాలనే తపనతో, మెకానికల్ ఇంజనీరింగ్ ఉద్యోగాన్ని వదిలేసి అన్నదాతల కోసం కదిలాడు. విశాఖపట్నం సమీపంలో మన్యం గ్రెయిన్స్ పేరుతో ఓ పరిశ్రమ ఏర్పాటు చేశాడు. గిరిజన రైతుల నుంచి నేరుగా ధాన్యాన్ని సేకరించడం, ప్రాసెసింగ్ చేసి అమ్మడం మొదలెట్టాడు. ఈ ప్లాంట్ ద్వారా ప్రస్తుతం తొమ్మిది రకాల తృణధాన్యాలను మార్కెట్ చేస్తున్నారు. మన్యం గ్రెయిన్స్ ప్రయత్నాల కారణంగా ఇక్కడి రైతుల ఆదాయం 30 శాతం వరకూ పెరిగింది, అలాగే గిరిజన రైతులను దళారీ మోసాల నుంచి తప్పించింది.

ఇంజనీరింగ్ డిగ్రీ పూర్తి చేసిన తర్వాత, బీహెచ్ఈఎల్‌లో ఉద్యోగంలో చేరానంటున్న శ్రీనివాస్.. ఆ జాబ్ తనకు ఒత్తిడితో కూడుకున్నదిగా అనిపించిందని చెప్తున్నారు. దీంతో స్నేహితుల సలహా మేరకు భువనేశ్వర్‌లోని జేవియర్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో చేరానని.. అక్కడ వ్యవసాయ సంక్షోభం, రైతు ఆత్మహత్యల సమస్యపై వచ్చిన కథనాలను చూసి చలించిపోయానన్నారు. దీంతో రైతులకు ఉపయోగపడే పని చేయాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, జార?ండ్‌లోని గిరిజన ప్రాంతాలలో తృణధాన్యాలను ఎక్కువగా సాగుచేస్తుంటారని.. వారికి ఉపయోగపడాలనే ఉద్దేశంతో అనకాపల్లిలో మన్యం గ్రెయిన్స్ ఏర్పాటు చేసినట్లు చెప్తున్నారు.

రైతు ఉత్పత్తి సంఘాలతో సమన్వయం చేసుకుంటూ, సరసమైన ధరలు, శిక్షణ, నమ్మకమైన మార్కెట్‌ను అందించడం ద్వారా, మన్యం గిరిజన రైతుల ఆదాయాన్ని 20 నుంచి 30 శాతం పెంచినట్లు చెప్తున్నారు. 2023-24లో తమ అమ్మకాల ఆదాయం కోటి దాటిందని శ్రీనివాస్ తెలిపారు. మరోవైపు బొర్రా శ్రీనివాస్ రావు గురించి తెలుసుకున్న ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.. అతణ్ని అభినందించారు. అధిక జీతం వచ్చే ఉద్యోగాన్ని వదిలి సొంతంగా వ్యాపారాన్ని ప్రారంభించారని, తృణధాన్యాల సాగును ప్రోత్సహిస్తూ, ఇప్పటివరకు 400 నుంచి 500 మంది రైతులకు సాధికారత కల్పించారని చంద్రబాబు కొనియాడారు. రైతుల ఆదాయాన్ని 20 నుంచి 30 శాతం పెంచిన శ్రీనివాస్.. యువతకు నిజమైన స్ఫూర్తి అంటూ ప్రశంసించారు. త్వరలోనే అతన్ని కలవాలని కోరుకుంటున్నట్లు చంద్రబాబు ట్వీట్ చేశారు.

# కర్నూలులో బెంచ్ ఏర్పాటుపై..
## ఏపీ హైకోర్టు కీలక వ్యాఖ్యలు




కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుపై ఏపీ హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలన్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదనను సవాల్ చేస్తూ ఏపీ హైకోర్టులో పిల్ దాఖలైంది. ఈ పిల్ మీద విచారణ జరిపిన ఏపీ హైకోర్టు.. ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. హైకోర్టు బెంచ్ ఏర్పాటుపై తమదే తుది నిర్ణయమని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు స్పష్టం చేసింది. న్యాయ కార్యదర్శి పంపిన లేఖ తమపై ప్రభావం చూపదని.. స్వతంత్రంగా నిర్ణయం తీసుకుంటామని హైకోర్టు స్పష్టం చేసింది. హైకోర్టు బెంచ్ ఏర్పాటు విషయంలో వేర్వేరు రాష్ట్రాల నుంచి వివరాలు తెప్పించుకున్నట్టు తెలిపింది. ఏపీలో బెంచ్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందా లేదా అనే దానిపైనా, ఇతర అంశాలపైనా సమాచారం తెప్పించుకుంటున్నట్లు తెలిపింది.

మరోవైపు కర్నూలులో శాశ్వత హైకోర్టు బెంచ్ ఏర్పాటు కోసం ప్రయత్నాలు జరుగుతున్న సంగతి తెలిసిందే. న్యాయమూర్తులకు కావాల్సిన సౌకర్యాలపై పూర్తి వివరాలు ఇవ్వాలని హైకోర్టు రిజిస్ట్రార్ సైతం ఇటీవల కర్నూలు కలెక్టర్‌కు లేఖ రాశారు. దీంతో కర్నూలు కలెక్టర్ సైతం అధికారులతో చర్చించి.. నివేదికను సమర్పించినట్లు తెలిసింది. మరోవైపు కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామని టీడీపీ కూటమి ఎన్నికల సమయంలో హామీ ఇచ్చింది. ఇక ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి రాగానే.. కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుపై ఏపీ కేబినెట్ తీర్మానం కూడా చేసింది. అనంతరం అసెంబ్లీలో తీర్మానం కూడా చేశారు. ఆ తర్వాత కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు ప్రతిపాదనపై అభిప్రాయాలు తెలుసుకునేందుకు కాంపిటెంట్ అథారిటీ ముందు ఈ అంశాన్ని ఉంచాలంటూ రాష్ట్ర న్యాయశాఖ కార్యదర్శి గతేడాది అక్టోబరులో హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌కు లేఖ రాశారు.

మరోవైపు కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుపై హైకోర్టు సీనియర్ న్యాయమూర్తులతో కమిటీ ఏర్పాటైంది. నలుగురు సీనియర్ న్యాయమూర్తులతో ప్రధాన న్యాయమూర్తి ఈ కమిటీని ఏర్పాటు చేశారు. ఇక హైకోర్టు బెంచ్ ఏర్పాటు కోసం కర్నూలులో వివిధ ప్రాంతాలను పరిశీలిస్తున్నారు. దిన్నెదేవరపాడులోని ఏపీఈఆర్సీ భవనాన్ని పరిశీలిస్తున్నారు. ఈ భవనాన్ని నూతనంగా నిర్మించడంతో పాటుగా ఇందులో విశాలమైన హాళ్లు, ప్రత్యేక గదులు అందుబాటులో ఉన్నాయి. అలాగే ఓ అతిథిగృహం, నాలుగు సూట్ రూములలు కూడా ఉన్నాయి. దీంతో పాటుగా బి.తాండ్రపాడు, మునగాలపాడు ప్రాంతాలను కూడా అధికారులు పరిశీలిస్తున్నారు.

## ఆంధ్రప్రదేశ్‌కు
# మరో ప్రతిష్టాత్మక కంపెనీ..
## అక్కడే.. ఫిక్స్!

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మరో ప్రతిష్ఠాత్మక కంపెనీ రానుంది. లులు గ్రూప్ భారతదేశంలో కార్యకలాపాలు విస్తరించాలని నిర్ణయించింది. లులు గ్రూప్ ఇంటర్నేషనల్ నాగ్‌పూర్, విశాఖపట్నం, అహ్మదాబాద్‌లలో ప్రాజెక్టులు చేపట్టాలని.. తన కార్యకలాపాలను విస్తరించాలని యోచిస్తోంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో భారతదేశం అభివృద్ధి సాధిస్తుందంటున్న లులు గ్రూపు ఛైర్మన్ యూసఫ్ అలీ.. భారతదేశ ఆర్థిక వ్యవస్థలో తమ భాగస్వామ్యం కూడా ఉండాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఐటీ, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాలలో ఇండియా, ఖతార్ మధ్య సంబంధాలు మెరుగుపడాలని కాంక్షించారు. ఈ క్రమంలోనే భారతదేశంలోని విశాఖపట్నం, అహ్మదాబాద్ వంటి చోట్ల తమ కార్యకలాపాలు విస్తరిస్తున్నట్లు తెలిపారు.

అహ్మదాబాద్‌లో అతిపెద్ద షాపింగ్ మాల్ నిర్మిస్తున్నామన్న లులు గ్రూపు ఇంటర్నేషనల్ ఛైర్మన్.. విశాఖపట్నంలో మరొకదానికి చర్చలు ప్రారంభించినట్లు చెప్పారు, వీటితో పాటుగానాగ్‌పూర్‌లో కొత్త ప్రాజెక్ట్ కోసం ఆలోచిస్తున్నట్లు తెలిపారు. మరోవైపు గతేడాది సెప్టెంబర్ నెలాఖర్లో లులు గ్రూప్ ఇంటర్నేషనల్ ఛైర్మన్ యూసఫ్ అలీ.. ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో భేటీ అయ్యారు. సచివాలయంలో చంద్రబాబుతో భేటీయైన లులు గ్రూప్ ప్రతినిధులు .. ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న అవకాశాల గురించి చర్చించారు. దీనిపై సీఎం చంద్రబాబు ట్వీట్ కూడా చేశారు.

విశాఖపట్నంలో లులూ గ్రూప్ షాపింగ్ మాల్, మల్టీప్లెక్స్ నిర్మాణంపై యూసఫ్ అలీతో చర్చించినట్లు చంద్రబాబు తెలియజేశారు. తిరుపతిలో లులూ మల్టీప్లెక్స్, విజయవాడలో లులూ హైపర్ మార్కెట్ నిర్మాణం గురించి చర్చించినట్లు తెలిపారు. ఫుడ్ ప్రాసెసింగ్ సెక్టార్‌లోనూ పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న అవకాశాల గురించి వివరించినట్లు చంద్రబాబు తెలిపారు. ప్రభుత్వం నుంచి అన్నిరకాలుగా ప్రోత్సాహం అందిస్తామని వారికి తెలియజేశారు. ఈ నేపథ్యంలో తమ భవిష్యత్ ప్రణాళికల గురించి వివరిస్తూ విశాఖపట్నంలో ప్రాజెక్టు గురించి లులు గ్రూప్ ఛైర్మన్ యూసఫ్ అలీ ప్రస్తావించడంతో.. త్వరలోనే విశాఖపట్నం వాసులను లులు ఇంటర్నేషనల్ షాపింగ్ మాల్ పలకరించే అవకాశాలు కనిపిస్తున్నాయి.



## శ్రీ కపిలేశ్వరస్వామి ఆలయంలో వైభవంగా బ్రహ్మోత్సవాలు ప్రారంభం

తిరుపతి : తిరుపతి శ్రీ కపిలేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాలు బుధవారం ధ్వజారోహణంతో వైభవంగా ప్రారంభమయ్యాయి. అర్చకుల వేదమంత్రోచ్ఛారణ, శంఖనాదాలు, శివనామస్మరణ మధ్య ధ్వజారోహణ ఘట్టం శాస్త్రోక్తంగా జరిగింది.

పంచమూర్తులైన సోమస్కంధమూర్తి, కామాక్షి అమ్మవారు, వినాయక స్వామి, చండికేశ్వరస్వామి, వల్లి, దేవసేన సమేత సుబ్రమణ్యస్వామివారి ఉత్సవమూర్తుల సమక్షంలో నంది చిత్రంతో కూడిన వస్త్రాన్ని ధ్వజపటానికి చుట్టి ధ్వజస్తంభంపైకి అధిరోహింపచేశారు. ధ్వజారోహణంలో భాగంగా మొదట ధ్వజపటం అధిరోహణ, ఆ తరువాత ధ్వజస్తంభానికి అభిషేకం, బలి, నివేదన, దీపారాధన, ఉపచారాలు నిర్వహించారు.



# మిర్చి రైతుల కోసం రంగంలోకి చంద్రబాబు..
## కేంద్రానికి లేఖ

ఏపీలోని మిర్చి రైతులను ఆదుకోవాలని సీఎం నారా చంద్రబాబు నాయుడు కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. రాష్ట్రంలోని మిర్చి రైతుల పరిస్థితిని వివరిస్తూ కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు చంద్రబాబు లేఖ రాశారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే మిర్చిని కొనుగోలు చేసి, రైతులను ఆదుకోవాలని కోరారు. మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్ కింద మిర్చి పంటను వెంటనే కొనుగోలు చేయాలని చంద్రబాబు నాయుడు కేంద్రాన్ని కోరారు. ఏపీలో మిర్చి రైతుల పరిస్థితిని లేఖలో వివరించిన చంద్రబాబు.. మార్కెట్‌లో ధరల పతనంపై ఇటీవల ఢిల్లీలో జరిగిన సమావేశం వివరాలను లేఖలో ప్రస్తావించారు. ఏపీ ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని మార్కెట్ ఇంటర్వెన్షన్ పథకం కింద 50 శాతం కాకుండా పూర్తి వ్యయాన్ని కేంద్రమే భరించాలని చంద్రబాబు కోరారు.

మరోవైపు ఏపీలో ఈ ఏడాది మిర్చి విస్తీర్ణం, ఉత్పత్తి పెరిగిందన్న సీఎం చంద్రబాబు.. గతేడాది క్వింటాల్ 20 వేలు పలికిన వెరైటీ మిర్చి, ఇప్పుడు 13 వేలకు పడిపోయిందన్నారు. సాధారణ రకం మిర్చి ఏకంగా 11 వేలకు దిగజారిన విషయాన్ని లేఖలో ప్రస్తావించారు. విదేశాలకు మిర్చి ఎగుమతి తగ్గడం వలన ఈ పరిస్థితి వచ్చిందని చంద్రబాబు తెలిపారు. ధరల పతనంతో మిర్చి రైతులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని.. కేంద్ర ప్రభుత్వం వెంటనే మార్కెట్ ఇంటర్వెన్షన్ పథకం కింద కొనుగోళ్లు ప్రారంభించాలని చంద్రబాబు లేఖలో కోరారు.

మరోవైపు మిర్చి ధరలు పడిపోవటంతో మిర్చి రైతులు లబోదిబోమంటున్నారు. తమను ప్రభుత్వమే ఆదుకోవాలని కోరుతున్నారు. ఈ నేపథ్యంలో వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సైతం గుంటూరు మిర్చి యార్డును బుధవారం పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. అనంతరం మిర్చి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని, సీఎం నారా చంద్రబాబు నాయ్నుడు వెంటనే గుంటూరు మార్కెట్ యార్డుకు వచ్చి రైతులతో మాట్లాడాలని డిమాండ్ చేశారు. మిర్చి రైతులకు ప్రభుత్వం అండగా నిలబడాలని, వారి పంటను కొనుగోలు చేయాలని వైఎస్ జగన్ మోహన్ రెడ్డి డిమాండ్ చేశారు.



# చత్రపతి శివాజీ అందరివాడు

**గర్రెపల్లి లో అరె సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో చత్రపతి శివాజీ జయంతి వేడుకలు**

**చత్రపతి శివాజీ దేశంలోని యువతకు ఆదర్శప్రాయుడు**

**ఆరు కుల సంఘం అధ్యక్షుడు దోకిడి తిరుపతి**

సైదాపూర్ ,19 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): చత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని పురస్కరించుకొని సైదాపూర్ మండలంలోని గర్రెపల్లి గ్రామానికి చెందిన ఆరుకుల సంఘం నాయకులు చత్రపతి శివాజీకి పూలమాలలు వేసి స్వీట్లు పంపిణీ చేయడం జరిగింది. దోకిడి తిరుపతి మాట్లాడుతూ చత్రపతి శివాజీ మొగలు సామ్రాజ్యాన్ని ఎదిరించిన ధీరుడు యావత్ భారత వీరత్వానికి ప్రతి కొలుచుకునే ఛత్రపతి శివాజీ ఈరోజు ఆయన జయంతి జరుపుకోవడం జరిగింది. 1630 ఫిబ్రవరి 19న మహారాష్ట్ర పూణే జిల్లాల్లో ఉన్న శివ నీరు కోటలో జిజియా బాయ్ షాహజీ దంపతులకు జన్మించారు 16వ ఏటనే కత్తి పట్టి మాస్టర్ స్టాటజిస్ట్ గా ఎదిగిన చత్రపతి శివాజీ అనేక యుద్ధాలు చేసి మరాఠ సామ్రాజ్యాన్ని స్థాపించారు. చత్రపతి శివాజీ అందరివాడు కానీ కొందరు వాడు కాదు అని అన్నారు దేశంలోని యువత అందరికీ ఆదర్శప్రాయుడని దేశం పట్ల ధర్మం పట్ల నిబద్ధత ఉండడంతో స్ఫూర్తి అని అన్నారు . ఈ యొక్క కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి మోకిడి తిరుపతి , గౌరవ అధ్యక్షులు కౌడగాని కిషన్ రావు, ఉపాధ్యక్షులు మ్యాన శ్రీనివాస్, కోశాధికారి గుబిరా వెంకటేష్, మండలాధ్యక్షుడు వర్నె సతీష్, జిల్లా ఉపాధ్యక్షులు వర్నె మోహన్ రావు, జిల్లా కార్యవర్గ సభ్యులు కౌడగాని మోహన్రావు, శివాజీ ఉత్సవ కమిటీ చైర్మన్ మోకిడి శ్రీనివాస్ , కమిటీ సభ్యులు రామారావు,మోకిడి దేవరాజ్, కౌడగాని వీరేశం , మోకిడి చిన్న తిరుపతి, గడ్డి శ్రీనివాస్, అమరగొండ తిరుపతి,మ్యాన బిక్షపతి, వరికల కుమార్ , మేన కనక లక్ష్మి,గుబురే స్వరూప, మ్యాన కనకయ్య,గడ్డి చిరంజీవి,అంబీరు



నరసింహారావు, దూకిడి నరేష్,మ్యాన నాగేశ్వరరావు, మోకిడి కిషన్ రావు, దేవరాజు హరీష్ రవీందర్ అనిత, దోకిడి రాజేశ్వరరావు,వెంకట్రావు, కౌడగాని రాజేశ్వరరావు రాజయ్య, కుమార్ తదితరులు పాల్గొన్నారు

# చత్రపతి శివాజీ మహారాజ్ 395 వ జయంతి.

**- ఆరెకుల సంఘం జిల్లా అధ్యక్షులు ఇంగిలే రామారావు.**



కరీంనగర్ ఫిబ్రవరి 19( క్రాంతిన్యూస్ ): కరీంనగర్ జిల్లా కేంద్రంలో చత్రపతి శివాజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆరే కుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఇంగిలే రామారావు ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ 395 వ జయంతిని ఘనంగా నిర్వహించారు . ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ దేశభక్తికి, దైవభక్తికి, ధైర్యానికి మారుపేరు,నవతరానికి స్ఫూర్తి ప్రదాత ఛత్రపతి శివాజీ మహారాజ్ అని, దండయాత్రలను ఎదిరించి నిలిచిన యుద్ధ వీరుడు, కోట్లాది మంది భారతీయుల స్ఫూర్తిదాయకుడు, మరాఠా సామ్రాజ్యాన్ని స్థాపించిన యోధుడని,శ్రీ ఛత్రపతి శివాజీ మహారాజ్ పోరాట వీరుడికి ఇవే మా ఘన నివాళులని చత్రపతి శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి కేక్ కట్ చేసి స్వీట్లు,పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి అదర్ సండే నాగేశ్వరరావు, డివిజన్ ఇంచార్జ్ ఇంగిలే ప్రభాకర్, ఆరే సంఘం నాయకులు గుండెకారి మధు, అంబరగొండ బాపురావు, అంబరగొండ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛదనం పచ్చదనంగా సిరిసిల్ల పట్టణం ఉండాలి

**కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**సిరిసిల్ల పట్టణంలోని పలు వార్డులు, కొత్త చెరువు, రైతు బజార్ పరిశీలన**



రాజన్న సిరిసిల్ల,19 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ):సిరిసిల్ల పట్టణం నిత్యం స్వచ్ఛతగా.పచ్చదనము గా పరిశుభ్రంగా ఉండాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు.సిరిసిల్ల పట్టణంలోని కొత్త చెరువు, పాత బస్టాండ్, సంజీవయ్య నగర్, పద్మ నగర్, వెంకంపేట, కార్గిల్ లేక్, కొత్త బస్టాండ్, రైతు బజార్,బైపాస్ రహదారులు, బతుకమ్మ ఘాట్ ను క్షేత్ర స్థాయిలో బుధవారం తనిఖీ చేశారు.సిరిసిల్ల ప్రధాన రహదారి మధ్యలోని డివైడర్ కు కావాల్సిన మరమ్మత్తులు, మొక్కల పెంపకం చేపట్టాలని సూచించారు.స్పెషల్ డ్రైవ్ చేపట్టి అన్ని ప్రధాన రహదారులు నిత్యం శుభ్రం చేయించాలని, కొత్త చెరువు పరిసరాలు శుభ్రం చేయించాలని,విద్యుత్,నీటి సరఫరా పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని,చెరువు వద్ద ఉన్న దుకాణాలను పరిశీలించాలని, కొత్త చెరువులోకి, ఇక్కడి నుంచి వరద నీరు వెళ్లేందుకు పనుల ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు అదేవిధంగా సంజీవయ్య జంక్షన్ అభివృద్ధికి డీపీఆర్ తయారు చేయాలని, పట్టణంలో ఏర్పాటు చేసిన హోర్డింగ్స్ అడ్వర్టైజ్మెంట్ పన్ను చెల్లించారా లేదా అని పరిశీలించాలని ఆదేశించారు. పన్ను చెల్లించకుండా ఆయా ప్రదేశాల్లో ఏర్పాటు చేసిన వాటిని తొలగించాలని, పట్టణంలోని అన్ని మురుగు కాలువలు శుభ్రం చేయించాలని, కార్గిల్ లేక్ పరిసరాలు శుభ్రం చేయించాలని,లేక్ కు కావాల్సిన మరమ్మత్తులు వెంటనే చేపట్టాలని, అందంగా తీర్చిదిద్దాలని పేర్కొన్నారు

బతుకమ్మ ఘాట్ వద్ద ఉన్న షటర్లు అద్దెకు ఇచ్చేందుకు వేలం వేయాలని, రైతు బజార్ పరిసరాలు శుభ్రం చేయించాలని,ఆయా రోడ్లలో అనుమతి, లైసెన్స్ లేని దుకాణాలు తొలగించాలని సూచించారు.అన్ని దుకాణాల ట్రేడ్ లైసెన్స్ లు పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారు. రోడ్ల వెంట, ఆయా ప్రదేశాల్లో నాటిన మొక్కలు సంరక్షించాలని సూచించారు. పందుల పెంపకం దారులతో సమావేశం ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు.పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ పర్యటనలో మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, ఏఈ స్వామి, సిబ్బంది తదితరులు ఉన్నారు.

# ఆర్టీసీ ప్రయివేట్ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యానికి బాలుడు మృతి

**-నడుచుకుంటు వెళుతున్న బాలుడిని ఢీ కొట్టిన ఆర్టీసీ బస్సు,**

**-బస్సుతో పాటు డ్రైవర్‌ను పోలీసులకు అప్పగింత,**

**-బాలుడి కుటుంబంలో విషాధం నింపిన ఘటన.**




వికారాబాద్,19 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): ఆర్టీసీ ప్రయివేట్ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యానికి ఏడేళ్ల బాలుడు బలి అయ్యాడు. రోడ్డు పక్కనుంచి నడుచుకుంటూ వెళుతున్న బాలుడిని బస్సు ఢీ కొనడంతో గాయాలపాలైన బాలుడిని ఆసుపత్రికి తరలించగా మృతి చెందాడు. బుధవారం బషీరాబాద్ మండలంలో జరిగిన,ఈ సంఘటన వాళ్ళ కుటుంబంలో విషాధం నింపింది. చనిపోయాడని వైద్యులు తెలపడంతో తల్లిదండ్రులు బోరున విలపించారు. వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండల ఎస్ఐ శంకర్ తెలిపిన వివరాల ప్రకారం,బషీరాబాద్ మండలంలోని టాకీ తాండాకు చెందిన రాథోడ్ వెంకటేష్ కుమారుడు రాథోడ్ శ్రీరామ్(7) చదువుకుంటున్నాడు.

బుధవారం సాయంత్రం తాండాలోని రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళుతుండగా తాండూరు నుంచి క్యాద్గీర వైపు వెళు తున్న ఆర్టీసీ బస్సు(టీఎస్ 34 టీఏ 6545) డ్రైవర్ నిర్లక్ష్యంగా,అజాగ్రత్తగా నడిపిస్తూ బాలుడిని ఢీకొట్టాడు. ఈ క్రమంలో బస్సు కింద పడిన శ్రీరామ్ తలకు, ఛాతి భాగంలో గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు బస్సును అడ్డగించి గాయాలపాలైన శ్రీరామ్ ను 108 సాయంతో తాండూరులోని మాతా శిశు ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించాలని సూచించారు. కొద్ది సేపటికే బాలుడు శ్రీరామ్ మృతి చెందాడు.

దీంతో బాలుడు తల్లిదండ్రులు బోరున విలపించారు. ఈ సంఘటన స్థానికులను కంటతడి పెట్టించింది. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం తాండూరులోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి మార్చురికి తరలించారు. మరోవైపు ప్రమాదానికి కారణమైన బస్సును స్థానికులు బషీరాబాద్ పోలీస్టేషన్‌కు తరలించారు. అజాగ్రత్తగా నడిపించిన డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శంకర్ తెలిపారు.

# అంబరాన్నింటిన చత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు



జగ్గయ్యపేట,,19 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ):జగ్గయ్యపేట పట్టణంలో చత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు అంబరాన్ని అంటాయి. హిందూ చైతన్య వేదిక ఆధ్వర్యంలో జరిగిన చత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలలో భాగంగా పట్టణంలోని పాతపేట గడ్డ వద్ద నుండి శోభాయాత్ర పట్టణంలో నిర్వహించారు. ఈ శోభాయాత్రలో మహిళా భక్తులు కోలాటాలు వేస్తూ ముందుకు సాగారు. యువకులు చిన్నారులు మహిళలు వివిధ ఆధ్యాత్మిక వేషధారణ లతో, మరి కొందరు చత్తపతి శివాజీ మహారాజ్ వేషధారణలో భక్తులను విశేషంగా ఆకట్టుకున్నారు. యువకులు పెద్దలు పట్టణ ప్రముఖులు బైక్ ర్యాలీలో పాల్గొనగా బైక్ ర్యాలీని శోభాయాత్రను గాయత్రి ఆశ్రమ వ్యవస్థాపకులు ఆధ్యాత్మికవేత్త బ్రహ్మశ్రీ చిట్టా లక్ష్మీనరసింహ శాస్త్రి జండా ఊపి ప్రారంభించారు. బ్రాహ్మణ సంఘ ప్రతినిధులు వామన శర్మ, తిరుమలగిరి ఆలయ ప్రధాన అర్చకులు తిరునగరి రామకృష్ణమాచార్యులు, వేద పండితులు భరద్వాజ్ శర్మ , సాయి శర్మ, మహేష్ శర్మ, శ్రావణ్ శర్మ, పలు ఆలయాల అర్చకులు బ్రాహ్మణ సంఘ ప్రతినిధులు ,వైష్ణవులు, శోభాయాత్రలో అగ్రభాగాన ఉండి ముందుకు నడిపించారు.



చత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలలో శాసనసభ్యుడు శ్రీరాం రాజగోపాల్ తాతయ్య, ఎన్టీఆర్ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, మాజీమంత్రి నెట్టెం రఘురాం, జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు సామినేని ఉదయభాను, తెలుగుదేశం పార్టీ యువ నేత శ్రీరాం ధనుంజయ చినబాబు శోభాయాత్ర, భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమం నిర్వహిస్తున్న కోర్ కమిటీ ప్రతినిధులు ఉత్సవ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు ముఖ్యంగా హిందూ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు పిన్నం వెంగళరావు, హిందూ చైతన్య వేదిక పట్టణ అధ్యక్షుడు సంక భాస్కర్ , చత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ కోర్ కమిటీ చైర్మన్ పబ్బతి నరేంద్ర, కోర్ కమిటీ ప్రతినిధులు నోముల రఘు, తూములూరి అశోక్ , అల్లి రవిచంద్ ,ఉత్సవ కమిటీ ప్రతినిధులు వాళ్లతో మాట్లాడి అభినందించారు. ఈ కార్యక్రమంలో బిజెపి పార్టీ సీనియర్ నాయకులు కిసర రాంబాబు, మన్నే శ్రీనివాసరావు, అన్నెపాగ ప్రపుల్లశ్రీకాంత్, పట్టణ ప్రముఖులు నగరికంటి నాగేశ్వరరావు, బీసీ నాయకులు కృష్ణ,జియాలజిస్ట్ ధరణికోట వెంకటరమణ, సమరసత సేవ సంస్థ ప్రతినిధులు, చత్రపతి శివాజీ మహారాజ్ యువసేన, చత్రపతి శివాజీ మహారాజ్ ఉత్సవ కమిటీ ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

# ఘనంగా చత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహావిష్కరణ



కమలాపూర్ ,19 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్):హనుమకొండ జిల్లా, కమలాపూర్ మండల కేంద్రంలోని నేటి యువత ఛత్రపతి శివాజీ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలని మాజీ మంత్రి లోక సభ సభ్యులు ఈటల రాజేందర్ అన్నారు... కమలాపూర్ మండలం నేరెళ్ల గ్రామంలో ఆరె సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని, విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ చత్రపతి శివాజీ మహారాజ్ 395 వ జయంతి ఉత్సవాలు ఆరె సంక్షేమ సంఘం నేరెళ్ల గ్రామ కమిటీ ఆధ్వర్యం బాసిరి కిరణ్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు.మహారాష్ట్రలో సాధారణ కుటుంబంలో పుట్టిన శివాజీ స్వశక్తితో ఒక రాజ్యాన్ని స్థాపించి, దేశంలోని బహుజనుల చీకటి బతుకుల్లో దారి దివిటీ అయ్యాడని,స్వరాజ్యంలో రైతులు, స్త్రీలు, అప్పృశ్యులు, గిరిజనులు, సబ్బండ వర్గాలను భాగస్వామ్యం చేసి బహుజన నిర్మాణం ఎలా ఉండాలో శివాజీ పాలన నేటి పాలకులకు ఆదర్శం అని,ఆయన మార్గాన్ని అందరూ అనుసరించాలన్నారు... ఆరె సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు చెట్టుపెల్లి శివాజీ మాట్లాడుతూ రాజులు పోయారు.., రాజ్యాలు విచ్చిన్నమయ్యాయి కాని

శివాజీ లాంటి బహుజన పాలకుడిని కీర్తి ప్రపంచానికి చాటాలన్నారు.వియత్నాం వంటి దేశం ఛత్రపతి స్ఫూర్తితో యుద్ధంలో విజయం సాధించిందని పేర్కొన్నారు... ఆరె సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ జెండా రాజేష్ మాట్లాడుతూ ఓబీసీ కోసం నిరంతరం పోరాడుతున్నామని,ఆ కలను ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం నెరవేర్చాలని అన్నారు. మాజీ మంత్రి ఈటల రాజేందర్ అనంతరం బూర్గుల సమ్మయ్య ఇంటిదగ్గర భోజనం చేశారు...ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు వలిగే సాంబారావు,విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మోటె చిరంజీవి, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు శివాజీ,ప్రధాన కార్యదర్శి కిషన్ రావు,నాయకులు లక్ష్మణ్ రావు, సుకిన సంతాజి, తిరుపతి రావు, దామోదర్, లింగమూర్తి, కండె రావు, చంద్రావు, భాస్కర్, మరియు ఆరె కుల నాయకులు నేరెళ్ల గ్రామాస్తులు పాల్గొన్నారు....

ఆరోగ్య క్రాంతి

KR TV క్రాంతి

గురువారం 20 ఫిబ్రవరి 2025

epaper.krtvnews.com

## తరచూ ఒళ్లు నొప్పులుగా ఉంటుందా.. అయితే ఇవే కారణాలు కావచ్చు..!



హెల్త్ న్యూస్ ,19 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ):మనకు తరచూ పలు అనారోగ్య సమస్యలు వస్తూనే ఉంటాయి. వాటిల్లో బాటీ పెయిన్స్ కూడా ఒకటి. ఒళ్లు నొప్పులు అనేవి సహజంగానే మనకు తరచూ వస్తూనే ఉంటాయి. కాస్త ఎక్కువగా పనిచేసినా లేదా పలు ఇతర కారణాల వల్ల కూడా మనకు ఒళ్లు నొప్పులు వస్తుంటాయి. అయితే ఇవి రోజూ సరిగ్గా నిద్రిస్తే ఉండవు. ఇందుకు ఎలాంటి పెయిన్ కిల్లర్స్‌ను వాడాల్సిన పనిలేదు. కానీ కొందరికి మాత్రం ఒళ్లు నొప్పులు ఎల్లప్పుడూ ఉంటాయి. ఇలా ఒళ్లు నొప్పులు ఎల్లప్పుడూ ఉంటే చాలా ఇబ్బందిగా ఉంటుంది. ఏ పనిచేయలేకపోతుంటారు. బయటకు వెళ్లలేకపోతుంటారు. ఇలా ఒళ్లు నొప్పులు ఎప్పుడూ ఉండడం వెనుక పలు బలమైన కారణాలు ఉంటాయని వైద్యులు చెబుతున్నారు. అవేమిటో ఇప్పుడు తెలుసుకుందాం.

నిద్రలేమి..

మనం రోజుకు 6 నుంచి 8 గంటలపాటు నిద్రించాలి. ఈ విషయాన్ని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. మనం నిద్రపోయినప్పుడే శరీరం శక్తి వనరులను పునరుత్పత్తి చేసుకుంటుంది. నిద్ర మనల్ని రీఫ్రెష్ చేస్తుంది. అయితే ఈ రోజుల్లో చాలా మంది నిద్రలేమితో బాధపడుతున్నారు. తగినంత నిద్ర లేకపోవడం వల్ల శరీం శక్తి వనరులను భర్తీ చేసుకోకపోవడంతో ఒళ్లు నొప్పులు వస్తాయి. కనుక ఒళ్లు నొప్పులకు దీన్ని ప్రధాన కారణంగా చెప్పవచ్చు. శరరీంలో నీరు తగ్గిపోవడం వల్ల నొప్పులకు దారి తీస్తుంది. శరీరానికి అవసరం అయిన నీటిని తాగకపోవడం, దానికి తోడు శరీరం లోంచి నీరు బయటకు పోవడం వల్ల డీహైడ్రేషన్ బారిన పడతారు. దీని వల్ల అలసట, ఒళ్లంతా నొప్పులు వస్తాయి. ఒళ్లు నొప్పులు వచ్చేందుకు దీన్ని కూడా ఒక కారణంగా చెప్పవచ్చు.

కీళ్ల నొప్పులు..

రక్తంలో ఐరన్ చాలా ముఖ్యమైన మూలకం అని చెప్పవచ్చు. ఇది తక్కువ మొత్తంలో ఉండడం వల్ల శరీరంలోని వివిధ భాగాలకు పోషకాలు, ఆక్సిజన్ సరిగ్గా లభించవు. ఫలితంగా అలసటతోపాటు బాడీ పెయిన్స్ కూడా వస్తాయి. ఆర్థరైటిస్ లేదా కీళ్ల వాపుల సమస్యలు ఉన్నవారికి కూడా తరచూ ఒళ్లు నొప్పులు వస్తుంటాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. వీటిని తగ్గించుకుంటే బాడీ పెయిన్స్‌ను తగ్గించుకోవచ్చని అంటున్నారు. చలి, వానా కాలాల్లో జలుబు, ఫ్లూ సమస్యలు సర్వ సాధారణంగా అందరికీ వస్తూనే ఉంటాయి. అయితే ఈ వైరల్ ఇన్ఫెక్షన్ల వల్ల కూడా విపరీతంగా ఒళ్లు నొప్పులు ఉంటాయి. కనుక ఒళ్లు నొప్పులకు వీటిని కూడా కారణాలుగా చెబుతున్నారు.

ఒత్తిడి..


ఒత్తిడి మనల్ని శారీరకంగానే కాక మానసికంగా కూడా ప్రభావితం చేస్తుంది. ఒత్తిడి ఎక్కువైతే శరరీం బాగా అలసిపోతుంది. దీంతో శరీరం మరింత బలహీనంగా మారుతుంది. దీని వల్ల రోగ నిరోధక శక్తి తగ్గుతుంది. దీంతో మీ శరీరం ఎన్నో రోగాలకు నిలయంగా మారుతుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఇవన్నీ శరీర నొప్పులుకు కారణం అవుతాయని అంటున్నారు. ఇలా మీకు ఒళ్లు నొప్పులు తరచూ వస్తున్నాయంటే ఇవన్నీ కారణాలుగా చెప్పవచ్చు. వీటిల్లో సరైన కారణాన్ని తెలుసుకుని అందుకు తగిన విధంగా సమస్యను పరిష్కరించుకోవాలి. దీంతో ఒళ్లు నొప్పుల నుంచి సైతం ఉపశమనం లభిస్తుంది. అన్ని విధాలుగా ఆరోగ్యంగా ఉండవచ్చు.

## కామెర్లు వచ్చినవారు ఏం తినాలి? ఏం తినకూడదు?

హెల్త్ న్యూస్ ,19 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ):కామెర్లు. ఇది లివర్ పైన ప్రభావం చూపే వ్యాధిగా చెప్పబడింది. కామెర్ల వ్యాధి వచ్చినవారు ఆహారంలో పత్యం పాటించాల్సి వుంటుంది. అంటే... కొన్ని పదార్థాలు తినవచ్చు. మరికొన్ని పదార్థాలను ఎట్టి పరిస్థితులలో తీసుకోరాదు.యాపిల్స్, బెర్రీస్ వంటి పండ్లు ఆరగించవచ్చు.క్యారెట్స్, చిలకడదుంపలు, బీట్ రూట్స్ తినవచ్చు.ఉప్మా లేదా పోహ వంటి అల్పాహారాలను భుజించవచ్చు.వెన్న లేకుండా మజ్జిగ, బెర్రీస్ జ్యూస్ తాగవచ్చు. ఇక బాగా వేయించిన పదార్థాల జోలికి వెళ్లకూడదు.వెన్న, నెయ్యి, కొవ్వుతో నిండిన పాల పదార్థాలు తినరాదు.బటర్ చికెన్, బిర్యానీ, పరోటాలు వంటి వాటి జోలికి వెళ్లకూడదు.అరటి కాయలు మోతాదు మించి తినరాదు.



## ఆడవారిలో ఈ లక్షణాలు ఉంటే క్యాన్సర్ ఉన్నట్లేనా?



హెల్త్‌న్యూస్,19ఫిబ్రవరి(క్రాంతిన్యూస్):

ఆడవారు తమ ఆరోగ్యాన్ని ఎక్కువగా పట్టించుకోరు. నిర్లక్ష్యం చేస్తారు. వారు నిర్లక్ష్యం చేసే చిన్న సమస్యలే తీవ్రమైన సమస్యలకి దారి తీస్తాయి. ఇంట్లోని వారందరి ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకుంటారు. కానీ, తమ ఆరోగ్యాన్ని చూసుకోవడం మర్చిపోతారు. దీని వల్ల చాలా సమస్యలు వస్తాయి. వీటికి సంబంధించిన లక్షణాలను మనం పట్టించుకోకపోతే అవి ప్రాణాంతకమవుతాయి. ఈ నేపథ్యంలోనే ఆడవారికి వచ్చే క్యాన్సర్ లక్షణాల గురించి తెలుసుకోండి.

### బ్రెస్ట్ క్యాన్సర్..

బ్రెస్ట్ క్యాన్సర్ అనేది ఆడవారిలో వచ్చే సాధారణ సమస్య. సరైన ట్రీట్‌మెంట్ అందిస్తే వ్యాధిని చాలా వరకూ నయం చేయొచ్చు. బ్రెస్ట్ క్యాన్సర్ లక్షణాలను పట్టించుకోకపోవడం వల్ల సమస్య తీవ్రమవుతుంది. రొమ్ము, చంకలో గడ్డలు, రొమ్ము పరిమాణ, ఆకృతిలో మార్పులు, తల్లి పాలు కాకుండా చనుమొనల ఇతర ద్రవాలు రావడం బ్రెస్ట్ క్యాన్సర్ ప్రధాన లక్షణాలు. రొమ్ములపై చర్మం కుంగిపోవడం, ఎర్రబడడం వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయొద్దు.

### ఒవేరియన్ క్యాన్సర్..

ఈ రెండు క్యాన్సర్స్ ప్రధానంగా మహిళల్లో కనిపిస్తాయి. అండాశయ క్యాన్సర్‌ని సైలెంట్ కిల్లర్ అంటారు. అండాశయంలో సాధారణ కణాల పెరగడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడుతుంది. పొత్తికడుపు ఉబ్బరం, వాపు, తిన్న తర్వాత అకస్మాత్తుగా నిండిన అనుభూతి, పెల్విక్ అసౌకర్యం, నొప్పి, మలబద్ధకం, తరచుగా మూత్రవిసర్జన చేయాలనే కోరిక వంటి ప్రేగు అలవాట్లు అండాశయ క్యాన్సర్ ప్రధాన లక్షణాలు.

రెక్టల్ క్యాన్సర్..

ఈ క్యాన్సర్ కూడా ఎలాంటి లక్షణాలని చూపించదు. ప్రపంచంలో క్యాన్సర్ మరణాలకి ఇది రెండో ప్రధాన కారణం. ప్రేగు అలవాట్లలో మార్పులు, మలంలో రక్తం, పొత్తికడుపు నొప్పి, ఆకస్మిక బరువు తగ్గడం, అలసట, ఈ క్యాన్సర్‌కి ప్రధాన లక్షణాలు..

### లంగ్, స్కిన్ క్యాన్సర్..

చాలా మందిని ఇబ్బంది పెట్టే సమస్యల్లో లంగ్ క్యాన్సర్ కూడా ఒకటి. దీర్ఘకాలిక దగ్గు, దగ్గుతో పాటు రక్తం, ఊపిరి ఆడకపోవడం, ఛాతీ, నొప్పి, బరువు తగ్గడం, ఆకలి లేకపోవడం వంటివన్నీ లంగ్ క్యాన్సర్ ప్రధాన లక్షణాలు. కొత్త చర్మం పెరుగుదల, పుండ్లు చర్మ క్యాన్సర్ ప్రధాన లక్షణాలు. ఇప్పటికే ఉన్న పుట్టుమచ్చలో ఏవైనా మార్పులని గమనించాలి. రంగులో తేడా, పరిమాణంలో తేడా ఉంటే గమనించాలి. సడెన్‌గా బరువు తగ్గడం క్యాన్సర్స్ ప్రధాన లక్షణం. రెగ్యులర్‌గా అలసట, తీవ్రమైన నొప్పి, జ్వరం, రాత్రి చెమటలు అన్నీ క్యాన్సర్స్ సాధారణ లక్షణాలు.

### సెర్విక్ క్యాన్సర్..

సెర్విక్ క్యాన్సర్.. గర్భాశయంలో అసాధారణ కణాల పెరుగుదలని గర్భాశయంలోని లోతైన కణజాలాలను ప్రభావితం చేస్తుంది. శరీరంలోని ఇతర భాగాలకు ముఖ్యంగా ఊపిరితిత్తులు, కాలేయం, మూత్రాశయం, యోని, పురీషనాళానికి వ్యాపిస్తుంది.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి..


రెగ్యులర్ చెకప్స్ అవసరం.

మామోగ్రామ్స్, పాప్ స్మియర్, ఇతర స్క్రీనింగ్ ద్వారా క్యాన్సర్స్‌ని ముందుగానే గుర్తించొచ్చు.

హెల్దీ ఫుడ్, రెగ్యులర్ వర్కౌట్, ధూమపానం, మద్యపానానికి దూరంగా ఉండడం వంటి క్యాన్సర్ ప్రమాదాన్ని దూరం చేస్తాయి.

రెగ్యులర్‌గా అంకాలజిస్ట్ సాయంతో చెకప్ చేయించుకోవాలి.

ఏవైనా లక్షణాలు గమనిస్తే ముందుగా గురించి ట్రీట్‌మెంట్ తీసుకోవడం మంచిది.



KR TV క్రాంతి

గురువారం 20 ఫిబ్రవరి 2025

# క్రీడలు

epaper.krtvnews.com



# ఐదుగురు స్పిన్నర్లా..? కాస్త ఎక్కువే

## టీమ్‌ఇండియా జట్టుపై దినేశ్ కార్తిక్



స్పోర్ట్స్ న్యూస్ ,19 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ):ఛాంపియన్స్ ట్రోఫీ కోసం ప్రకటించిన టీమ్‌ఇండియా జట్టులో ఐదుగురు స్పిన్నర్లకు చోటు కల్పించిన విషయం తెలిసిందే. చివరి నిమిషంలో జట్టులో బీసీసీఐ మార్పులు చేసింది. వరుణ్ చక్రవర్తి కోసం యశస్వి జైస్వాల్‌ను పక్కనపెట్టారు. దీంతో జట్టులో స్పిన్నర్ల సంఖ్య ఐదుకు చేరింది. దీనిపై మాజీ క్రికెటర్ దినేశ్ కార్తిక్ అసంతృప్తి వ్యక్తంచేశాడు. ఇది కాస్త ఎక్కువ అంటూ వ్యాఖ్యలు చేశాడు.

ఛాంపియన్స్ ట్రోఫీ టీమ్‌ఇండియా జట్టులో ప్రస్తుతం స్పిన్నర్లు అక్షర్ పటేల్, కుల్‌దీప్ యాదవ్, రవీంద్ర జడేజా, వరుణ్ చక్రవర్తి, వాషింగ్టన్ సుందర్ ఉన్నారు. వీరిలో అక్షర్, జడేజా, సుందర్‌లు స్పిన్ ఆల్‌రౌండర్లు కాగా.. మిగతా ఇద్దరూ స్పెషలిస్టు స్పిన్నర్లు. "జట్టులో ఐదుగురు స్పిన్నర్లు ఉండటం కొంచెం ఎక్కువే అని నా అభిప్రాయం. నలుగురే ఉంటారని నేను అనుకున్నాను. అయితే.. ఓపెనర్ స్థానంలో మరో స్పిన్నర్‌ను జోడించారు. దీంతో ఏం చేస్తారో నాకైతే కచ్చితంగా తెలియదు" అని ఓ క్రీడా ఛానల్‌తో డీకే విశ్లేషించాడు. ఇంతమంది స్పిన్నర్లు ఉండటంతో.. ఏ కాంబినేషన్‌తో ముందుకెళ్లాలనే దానిపై జట్టు యాజమాన్యంలో అనిశ్చితి ఉంటుందని పేర్కొన్నాడు.

ఇక జట్టుకు దూరమైన బుమ్రా స్థానంలో హర్షిత్ రాణా కంటే.. మహమ్మద్ సిరాజ్‌ను తీసుకుని ఉంటే బాగుండేదని డీకే అన్నాడు. బుమ్రా స్థానంలో రాణాకు చోటు కల్పించిన సెలక్షన్ కమిటీ.. సిరాజ్‌ను నాన్‌ట్రావెలింగ్ సబ్‌స్టిట్యూట్‌గా ఎంచుకుంది. "అనుభవం పరంగా చూస్తే సిరాజే సరైన ప్రత్యామ్నాయం. అయితే.. ఇంగ్లండ్‌పై హర్షిత్ రాణా చక్కగా రాణించాడు. అతడి ఆట తీరు భారత శిబిరాన్ని ఆకట్టుకొని ఉండొచ్చు. అందుకే సిరాజ్ కంటే అతడి వైపే మొగ్గు చూపించి ఉంటుంది" అని కార్తిక్ అన్నాడు.

ఇక ఛాంపియన్స్ ట్రోఫీలో భాగంగా టీమ్‌ఇండియా తన తొలి మ్యాచ్ బంగ్లా తో ఆడేందుకు సిద్ధమవుతోంది. దుబాయ్ వేదికగా ఈనెల 20న ఈ మ్యాచ్ జరగనుంది. ఆ తర్వాత అందరూ ఆసక్తికగా ఎదురుచూసే భారత్ పాకిస్థాన్ మ్యాచ్ 23న ఉండనుంది

# ఫ్యాన్స్ కోసం చార్టర్డ్ ఫ్లైట్లు

### ఆ రెండు మైదానాల్లోనే 12వేల మంది పోలీసుల పహారా!

స్పోర్ట్స్ న్యూస్ ,19 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): దాదాపు 29 ఏళ్ల తర్వాత పాకిస్థాన్ ఐసీసీ ట్రోఫీకి ఆతిథ్యం ఇస్తోంది. దీంతో తమ దేశంలో జరగనున్న ఛాంపియన్స్ ట్రోఫీ నిర్వహణకు ఎలాంటి ఆటంకాలు ఉండకూడదనే ఉద్దేశంతో పాకిస్థాన్ క్రికెట్ బోర్డు పెద్దఎత్తున భద్రతా ఏర్పాట్లను చేసింది. చివరిసారిగా 1996 వన్డే ప్రపంచ కప్‌నకు పాక్ హోస్ట్‌గా వ్యవహరించింది. ఇప్పుడు మళ్లీ ఛాంపియన్స్ ట్రోఫీని నిర్వహిస్తోంది. సెక్యూరిటీకి సంబంధించి తమ దేశంపై ఉన్న అపవాదును తొలగించేందుకు పీసీబీ నడుం బిగించినట్లు అక్కడి మీడియా వెల్లడించింది.





లాహోర్, రావల్పిండి మైదానాల్లో జరిగే మ్యాచ్‌ల కోసం దాదాపు 12వేల మందికిపైగా పోలీసులను మోహరించినట్లు తెలుస్తోంది. ఇందులో 18 మంది సీనియర్ ఆఫీసర్లు, 54 మంది డీఎస్పీలు, 135 మంది ఇన్‌స్పెక్టర్లు, 1200 మంది సబార్డినేట్‌లు, 10,556 మంది కానిస్టేబుళ్లు ఉన్నారు. 200 మంది వరకు మహిళా పోలీసులను కేటాయించారు. లాహోర్‌లో గ్రూప్ స్టేజ్‌లో ఫిబ్రవరి 22, 26, 28న మూడు మ్యాచ్‌లు జరుగుతాయి. మార్చి 5న రెండో సెమీస్‌కు లాహోర్ వేదిక. ఇక్కడే 8వేలకు పైగా సెక్యూరిటీ సిబ్బందిని కేటాయించినట్లు వార్తలు వస్తున్నాయి. రావల్పిండిలో మరో నాలుగు వేల మందికిపైగా పోలీసులను మోహరించనుంది. తొలి మ్యాచ్‌కు వేదికైన కరాచీలోనూ పెద్దఎత్తున సెక్యూరిటీని పీసీబీ పెట్టింది. ఇక్కడా గ్రూప్ స్టేజ్‌లో మూడు మ్యాచ్‌లు జరుగుతాయి.

ఫ్యాన్స్ కోసం..

ఓ వైపు మైదానాల్లో భద్రతకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్న పాక్ క్రికెట్ బోర్డు.. మరోవైపు జట్లు, ఫ్యాన్స్ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. పాకిస్థాన్ అంతర్జాతీయ ఎయిర్‌లైన్స్ ఆధ్వర్యంలో 9 ప్రత్యేకమైన చార్టర్డ్ ఫ్లైట్లను కేటాయించింది. కరాచీ, ఇస్లామాబాద్, లాహోర్ మధ్య ఈ ప్రయాణాలు జరగనున్నాయి.

# ఈ జనరేషన్‌లో అతడే బెస్ట్ ప్లేయర్

### - యువరాజ్ సింగ్

స్పోర్ట్స్ న్యూస్ ,19 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): క్రికెట్‌లో బెస్ట్ ప్లేయర్ ఎవరు? అనేది ఎప్పటికీ ముగిసిపోని చర్చ. ఆ ఆటగాడు గొప్ప? అంటే ఆ ఆటగాడు గొప్ప? అంటూ ఫ్యాన్స్ నిత్యం గొడవపడుతుంటారు. అయితే ప్రతి తరంలో ఒకరిద్దరు క్రికెటర్లు మాత్రం అద్భుతమైన ఆటతీరుతో గేమ్‌పై చెరగని ముద్ర వేస్తారు. అలాంటి వాళ్లే బెస్ట్ అని సీనియర్ క్రికెటర్లు, ఎక్స్‌పర్ట్స్ మెచ్చుకుంటారు. ఇప్పుడు టీమిండియా లెజెండ్ యువరాజ్ సింగ్ కూడా ఓ ఆటగాడ్ని ఇలాగే ప్రశంసించాడు. ఈ జనరేషన్‌లో అతడే బెస్ట్ అంటూ పొగడ్తల వర్షం కురిపించాడు. మరి.. యువీ లాంటి దిగ్గజం నుంచి ప్రశంసలు అందుకున్న ఆ ప్లేయర్ ఎవరు ?






పోటీనే లేదు : 'ఈ జనరేషన్‌లో విరాట్ కోహ్లీ అత్యుత్తమ ఆటగాడు. అతడ్ని నేను కింగ్ కోహ్లీ అని పిలుస్తుంటా. చాలా ఏళ్ల పాటు అతడు మహావిరాట్‌గా కొనసాగాడు. కెరీర్‌ను గమనిస్తే.. 15 నుంచి 18 ఏళ్ల పాటు భీకర ఫామ్‌లో కొనసాగాడు. ఇది మామూలు విషయం కాదు. అతడి గ్రాఫ్ కూడా అదే రేంజ్‌లో ఉంది. ఈ తరంలో అన్ని ఫార్మాట్లలోనూ బెస్ట్ ప్లేయర్‌గా కోహ్లీని చెప్పొచ్చు. అతడికి పోటీనే లేదు' అని యువరాజ్ చెప్పుకొచ్చాడు. చాంపియన్స్ ట్రోఫీ ఆరంభం నేపథ్యంలో ఓ స్పోర్ట్స్ చానల్ నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న యువీ.. కోహ్లీని మించినోడు లేడంటూ పొగడ్తల్లో ముంచెత్తాడు.

చెమటలు కక్కుతూ : చాంపియన్స్ ట్రోఫీ కోసం దుబాయ్‌కు చేరుకున్న విరాట్ కోహ్లీ నెట్ సెషన్స్‌తో ఫుల్ బిజీగా ఉన్నాడు. కెరీర్ చరమాంకంలో ఉండటంతో మళ్లీ చాంపియన్స్ ట్రోఫీ ఆడే అవకాశం కనిపించడం లేదు. అందుకే చివరి చాంపియన్స్ ట్రోఫీలో పరుగుల వరద పారించి టోర్నీని చిరస్మరణీయం చేసుకోవాలని కోహ్లీ భావిస్తున్నాడు. మైలురాళ్ల కంటే జట్టు విజయమే ధ్యేయంగా ఆడాలని అనుకుంటున్నాడట విరాట్. టీమ్ గెలుపు కోసం ఏం చేయడానికైనా వెనుకాడొద్దనే ఉద్దేశంతో గంటల కొద్దీ నెట్ సెషన్స్‌లో చెమటలు కక్కుతున్నాడని సమాచారం. ఈ తరుణంలో యువీ చేసిన వ్యాఖ్యలు అతడిలో మరింత కాన్ఫిడెన్స్ నింపుతాయని చెప్పొచ్చు .

# దిగొచ్చిన పాక్.. కరాచీ స్టేడియంపై

## రెపరెపలాడిని భారత మువ్వన్నెల జెండా

స్పోర్ట్స్ న్యూస్ ,19 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ నేటి నుంచి ప్రారంభం కానున్న విషయం తెలిసిందే. ఈ వెంట్ ప్రారంభానికి ముందుకు కరాచీ స్టేడియంపై భారత జాతీయ జెండా రెపరెపలాడింది. చాంపియన్స్ ట్రోఫీకి పాకిస్థాన్ ఆతిథ్యం ఇస్తున్న విషయం తెలిసిందే. ఐసీసీ నిబంధనల ప్రకారం ఏదైనా టోర్నీ జరుగుతున్న సమయంలో.. టోర్నీలో పాల్గొనే జట్లకు సంబంధించిన జెండాలను ఎగుర వేయాల్సి ఉంటుంది. అయితే, నిబంధనలకు విరుద్ధంగా గడాఫీ స్టేడియంలో భారత జెండాను పాకిస్థాన్ విస్మరించింది.



ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో.. పీసీబీ తీరుపై టీమ్‌ఇండియా అభిమానులు దుమ్మెత్తిపోశారు. దాయాది దేశం కావాలనే ఇలా చేసిందంటూ విమర్శలు చేశారు. మాజీ క్రికెటర్లు, పలువురు రాజకీయ నాయకులు సైతం పాక్ తీరుపై నిరసన వ్యక్తం చేశారు. పాకిస్థాన్ కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని ఆరపించారు. ఈ విమర్శలతో దిగొచ్చిన పాక్.. ఎట్టకేలకు కరాచీ స్టేడియంపై భారత మువ్వన్నెల జెండాను ఏర్పాటు చేసి వివాదానికి ముగింపు పలికింది.

ఎనిమిదేండ్ల సుదీర్ఘ విరామం తర్వాత క్రికెట్ అభిమానుల నిరీక్షణకు బుధవారంతో తెరపడనుంది. ప్రతిష్టాత్మక ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీకి బుధవారం నుంచి తెరలేవనుంది. 1996 తర్వాత పాకిస్థాన్‌లో జరుగుతున్న ఈ టోర్నీ నిర్వహణపై యావత్ దేశం భారీ అంచనాలే పెట్టుకుంది. 9వ ఎడిషన్‌గా జరుగబోయే ఈ టోర్నీని ఫిబ్రవరి 19 నుంచి మార్చి 09 దాకా పాకిస్థాన్, దుబాయ్‌లలో నిర్వహించనున్నారు. ఐసీసీ ఈవెంట్ హైబ్రిడ్ మోడల్‌లో జరుగుతున్న విషయం తెలిసిందే.

KR TV క్రాంతి
గురువారం 20 ఫిబ్రవరి 2025

# సినిమా న్యూస్

epaper.krtvnews.com



## ఈ టిప్స్ పాటించి బరువు తగ్గాను

మూవీ న్యూస్,19 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ):ఉత్తరాది భామ హన్సిక గురించి ఇప్పుడు ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం ఉండదు. 2003లో తన నట జీవితానికి శ్రీకారం చుట్టిన ఈ ఉత్తరాది బ్యూటీ 2007లో దేశముదురు చిత్రంతో తెలుగు చిత్ర పరిశ్రమకు కథానాయకిగా ఎంట్రీ ఇచ్చింది. తెల్లగా, బొద్దుగా, ముద్దుముద్దుగా ఉన్న ఈ భామ తొలి చిత్రంతోనే మంచి విజయాన్ని సొంతం చేసుకొని అందరి దృష్టిలోనూ పడింది. ఆ తర్వాత 2011లో ధనుష్‌కు జంటగా మాప్పిళ్లై చిత్రంతో కోలీవుడ్‌లో అడుగుపెట్టింది. ఈ చిత్రం సక్సెస్ అవడంతో హన్సికకు వరుసగా అవకాశాలు ఎక్కువగా తలుపుతట్టాయి. తెలుగు, తమిళం, కన్నడం, హిందీ భాషల్లో నటిస్తూ పాన్ ఇండియా నటిగా గుర్తింపు తెచ్చుకుంది. అంతేకాదు బొద్దుగా ఉండడంతో మొదట్లో కోలీవుడ్‌లో చిన్న కుష్బూ అనే ముద్రను కూడా వేసుకుంది. కాగా పలు భాషల్లో కథానాయకిగా నటించి 50 చిత్రాల మైలురాయి అధిగమించిన హన్సిక ఆ మధ్య పెళ్లి చేసుకుంది. దీంతో అమ్మడికి అవకాశాలు తగ్గాయనే చెప్పాలి. అయితే ఇంట్లో ఖాళీగా మాత్రం కూర్చోవడం లేదు. వాణిజ్య ప్రకటనల్లో నటించడం, టీవీ షోలకు అతిథిగా పాల్గొనడం అంటూ బిజీగానే ఉంటూ, సామాజిక మాధ్యమాల్లో యాక్టివ్‌గా ఉంటోంది.

ఇంతకుముందు బొద్దుగా ఉండే హన్సిక ఇప్పుడు చాలా స్లిమ్‌గా తయారైంది. తాను అలా తయారు కావడానికి ఉపయోగించిన టిప్స్‌ను కూడా చెప్పుకొచ్చింది. అందులో మంచినీళ్లు ఎక్కువగా తాగడం ముఖ్యకారణం అని పేర్కొంది. అదేవిధంగా యోగా, ధ్యానం, వంటి శారీరక కసరత్తులు చేస్తానని కేలరీలు అధికంగా ఉండే ఆహార పదార్థాలను దగ్గరకు రానివ్వనని ఈ టిప్స్ బరువు తగ్గడానికి ఎంతగానో సహకరిస్తాయని చెప్పుకొచ్చింది. మొత్తం మీద ఈ బొద్దుగుమ్మ చిక్కినా సక్కగానే ఉందంటూ నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు.

## ఛత్రపతి శివాజీగా రిషబ్‌శెట్టి.. ఫస్ట్ లుక్ రిలీజ్




మూవీ న్యూస్,19 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): కాంతార సినిమాతో పాన్ ఇండియా వైడ్‌గా గుర్తింపు తెచ్చుకున్నాడు కన్నడ నటుడు రిషబ్ శెట్టి. ప్రస్తుతం ఈ సినిమా ప్రీక్వెల్ తెరకెక్కించే పనిలో ఉన్నాడు. దీనితో పాటు తెలుగులో 'జై హనుమాన్' సినిమా చేస్తున్నారు. ఇదిలావుండగా.. ఆయన బాలీవుడ్ నుంచి వస్తున్న ఒక సినిమాలో ఛత్రపతి శివాజీ పాత్రలో నటించనున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా ఈ మూవీ నుంచి ఫస్ట్ లుక్ అప్‌డేట్ ఇచ్చారు మేకర్స్. ఈ సినిమాకు 'ది ప్రైడ్ ఆఫ్ భారత్: ఛత్రపతి శివాజీ మహారాజ్' అనే టైటిల్‌ను పెట్టారు మేకర్స్. ఇక నేడు ఛత్రపతి శివాజీ మహారాజ్ పుట్టినరోజు సందర్భంగా మూవీ ఫస్ట్ లుక్‌ని విడుదల చేశారు మేకర్స్. ఈ సినిమాకు సందీప్ సింగ్ దర్శకత్వం వహించబోతున్నాడు. ఈ సినిమాను 2027 జనవరి 21న హిందీతో పాటు తమిళం, తెలుగు, కన్నడ, మలయాళం భాషల్లో విడుదల చేయబోతున్నట్లు చిత్రబృందం తెలిపింది

## మార్చి 14న 'దిల్ రూబా'.



మూవీ న్యూస్,19 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ): గతేడాది 'క' సినిమాతో సినీప్రియుల్ని అలరించారు కథానాయకుడు కిరణ్ అబ్బవరం. ఇప్పుడాయన నుంచి రానున్న కొత్త చిత్రం 'దిల్ రూబా'. ఆయన.. రుక్సర్ థిల్లాన్ జంటగా నటించిన ఈ సినిమాని విశ్వ కరుణ్ తెరకెక్కించారు. రవి, జోజో జోస్, రాకేశ్ రెడ్డి, సరెగమ సంయుక్తంగా నిర్మించారు. ఈ చిత్రం మార్చి 14న రానుంది. ఈ నేపథ్యంలోనే మంగళవారం హైదరాబాద్‌లో "హేయ్ జింగిలి.." అనే గీతాన్ని విడుదల చేశారు. ఈ పాటకు సామ్ సీఎస్ స్వరాలు సమకూర్చడమే గాక స్వయంగా ఆలపించారు. భాస్కరభట్ల సాహిత్యమందించారు. ఈశ్వర్ నృత్యరీతుల అందించారు. ఈ సందర్భంగా హీరో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ.. "ప్రేక్షకులకు ఓ మంచి సినిమా అందివ్వాలన్న తపనతోనే.. ఏమాత్రం తొందర పడకుండా జాగ్రత్తగా అన్ని పనులు పూర్తి చేసుకుని మార్చి 14న తీసుకురావాలని నిర్ణయించుకున్నాం. ఇది హోలీ రోజు చాలా కలర్‌ఫుల్‌గా అందరూ వేడుక చేసుకునేలా ఉంటుంది" అన్నారు. "ఈ చిత్రానికి ఆయువు పట్టులాంటి పాటిది. ఈ చిత్ర విజయంలో కీలక పాత్ర పోషిస్తుందని నమ్ముతున్నా" అన్నారు గీత రచయిత భాస్కరభట్ల.

## ఆ సంఘటనతో మారాను



మూవీ న్యూస్,19ఫిబ్రవరి(క్రాంతిన్యూస్ ):'జీవితం అన్న తర్వాత ఒడిదుడుకులు సహజం. కుదుపులు లేకుండా ప్రయాణం సాగదు. నా జీవితంలో పెద్ద కుదుపు ఏడాది క్రితం జరిగిన యాక్సిడెంట్. దాని వల్ల చాలా విషయాలు నేర్చుకున్నా.' అంటున్నది అందాలభామ నభా నటేష్. నన్ను దోచుకుందువటే, ఇస్మార్ట్ శంకర్ సినిమాలతో గుర్తింపు తెచ్చుకున్న ఈ అందాలభామకు సోలో బ్రతుకే సో బెటర్, అల్లుడు అదుర్స్, మ్యాస్ట్రో, డార్లింగ్ సినిమాల రూపంలో పరాజయాలు పలకరించాయి.

ఈ బాధ నుంచి తేరుకునే లోపే పుండుకు పుల్ల మొగుడు అన్న చందాన.. నభా నటేష్‌కు యాక్సిడెంట్ అయ్యింది. సర్జరీలు కూడా జరిగాయి. దాంతో ఓ ఏడాదిపాటు సినిమాలకు దూరం కావాల్సి వచ్చింది. ప్రస్తుతం నభా తేరుకున్నది. ప్రస్తుతం నిఖిల్‌తో 'స్వయంభూ' సినిమా చేస్తూ బిజీగా ఉన్నది. ఇటీవల జిమ్‌లో తాను వర్కవుట్ చేస్తున్న ఓ ఫొటోను సోషల్‌మీడియాలో పోస్ట్ చేసి, కామెంట్‌ని కూడా జత చేసింది నభా. 'యాక్సిడెంట్ తర్వాత, తిరిగి మామూలు స్థితికి రావడానికి చాలా శ్రమించా.

ఆ క్షణంలోమానసికంగా ఎంతో బాధ అనుభవించా. ఫిట్‌నెస్ కోసం శ్రమించా. ఇప్పుడు నా శరీరంపై నాకు అవగాహన పెరిగింది. మొబిలిటీ ఎక్సర్సైజ్‌లు, స్విమ్మింగ్, డ్యాన్సింగ్ చేయడానికి ఇష్టపడుతున్నా. నటిగా ఉన్నప్పుడు తప్పదు కాబట్టి వ్యాయామం చేశా. ఇప్పుడు తప్పనిసరిగా వ్యాయామంచేస్తున్నా. ఈ యాక్సిడెంట్ వల్ల వర్కవుట్స్ విషయంలో నా ఆలోచనాధోరణి మారింది.' అని చెప్పుకొచ్చింది నభానటేష్.

## అందుకే మా పెళ్లిలో నో ఫోన్ పాలసీ పెట్టాం

మూవీ న్యూస్,19 ఫిబ్రవరి (క్రాంతిన్యూస్ ):గతేడాది ఫిబ్రవరిలో వివాహబంధంలోకి అడుగుపెట్టారు రకుల్ ప్రీత్ సింగ్. గోవాలోని ఓ రిసార్ట్స్‌లో రకుల్– జాకీ భగ్నానీ పెళ్లి అత్యంత సన్నిహితుల మధ్య జరిగింది. తన పెళ్లిని సింపుల్‌గా ఎందుకు చేసుకున్నారో తాజాగా వివరించారు. పెళ్లిలో నో ఫోన్ పాలసీ పెట్టడానికి కారణం తెలిపారు."మా పెళ్లిని చాలా సింపుల్‌గా చేసుకోవాలని ఎప్పటినుంచో అనుకున్నాం. లగ్జరీ కంటే సౌకర్యం ముఖ్యం. పెళ్లి జరిగిన విలువైన క్షణాలను ఎంజాయ్ చేశాం. సింపుల్‌గా పెళ్లి చేసుకోవడంలో ఒకరకమైన ఆనందం ఉంటుంది. వివాహం జరిగిన మూడు రోజులు మా జీవితంలో బెస్ట్‌గా ఉండాలనుకున్నాం. వివాహానికి వచ్చిన అతిథులు కూడా ఈ వేడుకను సెలబ్రేట్ చేసుకోవాలనుకున్నాం. అందుకే నో ఫోన్ పాలసీ పెట్టాం. అంతేకానీ, వాళ్లు మా పెళ్లి ఫొటోలు లీక్ చేస్తారని కాదు. ఈ వేడుక చిత్రాలను మేమే మొదట పంచుకోవాలని నిర్ణయించుకున్నాం. పెళ్లిలోని ప్రతి మూమెంట్‌ను డ్యాన్స్‌తో సెలబ్రేట్ చేసుకున్నాం. పెళ్లి దుస్తుల్లో కూడా డ్యాన్స్ వేశాం" అని రకుల్ తెలిపారు.



Printed, Published and owned by ----------------------, Printed at ----------------------, H.No. 00000000, ######, #####, 3#####, ##### #####. Telangana State,
Published from ##### #####, H.No. 000000000, ##### #####, ##### #####, ##### ##### ##### #####. ##### #####, Telangana State. Editor: asfghjklqwertt, RNI. No. APTEL/0000/00000, Cell: 1234567890, 0987654321 Email: sample@company.com